# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 12

బుధవారం, 01 జనవరి, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD





# సంక్రాంతికే భరోసా!

సెల్ఫ్ డిక్లరేషన్ మాత్రం తప్పనిసరి!.. మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం

ఎంత భూమిలో సాగు చేశాడో స్వయంగా తెలియజేస్తూ రైతు ఇచ్చేదే సెల్ఫ్ డిక్లరేషన్

ఎంత మేర భూమి సాగు చేస్తే అంత విస్తీర్ణానికే లెక్కగట్టి పెట్టుబడి సాయం

శాటిలైట్ ఇమేజ్, రిమోట్ సెన్సింగ్ డేటాతో నిర్ధారణ

వ్యవసాయాధికారి ఇచ్చే లెక్కలతో సరిపోల్చుకున్న తర్వాతే భరోసా

రైతుల్లో జవాబుదారీతనం పెంపొందుతుందంటున్న ప్రభుత్వం

ఎకరాకు రూ.7,500 చొప్పున చెల్లింపుపై కొరవడిన స్పష్టత

ఒక్కో రైతుకు ఎన్ని ఎకరాలకు సాయం ఇవ్వాలనేదీ ఖరారు కాని వైనం

జనవరి 2 లేదా 3న మరోసారి ఉప సంఘం భేటీ

4న జరిగే కేబినెట్ సమావేశంలో విధివిధానాలకు ఆమోదముద్ర!


**'అయ్యా.. ఫలానా గ్రామానికి చెందిన నాకు సర్వే నంబర్ 1లో ఎకరం పొలం ఉంది. నా ఇంటి ఆవరణతో కలిపి 100వ సర్వే నంబర్‌లో మరో ఎకరం చెలక ఉంది. ఇంటి జాగా 2 గుంటలు పోను మొత్తం ఎకరా 38 గుంటల్లో కూరగాయలు సాగు చేస్తున్నాను. ఇందులో ఎలాంటి తప్పుడు లెక్కలు చూపినట్లు తేలినా.. ప్రభుత్వం తీసుకునే చర్యలకు కట్టుబడి ఉంటాను. దయచేసి నేను సాగు చేసే భూమికి సంబంధించి రైతు భరోసా అందించగలరని మనవి' రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందాలనుకునే రైతు ఎవరైనా భవిష్యత్తులో వ్యవసాయ శాఖకు ఇవ్వాల్సిన 'సెల్ఫ్ డిక్లరేషన్ ' నమూనా ఇది.**



**హైదరాబాద్:** 'రైతుభరోసా' అమలుకు ముహూర్తం ఖరారైంది. కొత్త సంవత్సరంలో సంక్రాంతి కానుకగా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత కొన్నేళ్లుగా అమల్లో ఉన్న పెట్టుబడి సాయం 'రైతుబంధు' స్థానంలో 'రైతు భరోసా'ను కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్‌కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశమై పథకం మార్గదర్శకాలపై చర్చించింది. తాజాగా రెండురోజుల క్రితం జరిగిన సమావేశంలో తుది కసరత్తు కూడా పూర్తి చేసింది. వానాకాలం, యాసంగి సీజన్లలో రైతు ఎంత మేర భూమి సాగు చేస్తే అంత విస్తీర్ణానికే లెక్కగట్టి రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. గతంలో ఎంత భూమి ఉంటే అంత భూమికి రైతుబంధు అందేది. ఇలాఉండగా రైతు ఎంత భూమిలో సాగు చేశాడో స్వయంగా - మిగతా 2వ పేజీలో

# తుది తీర్పు వరకు కేటీఆర్ అరెస్టు వద్దు

## 'ఫార్ములా ఈ' కేసులో ఏసీబీకి హైకోర్టు ఆదేశం



**హైదరాబాద్:** ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారంపై నమోదైన కేసులో ఎఫ్ఐఆర్‌ను రద్దుచేయాలని కోరుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తుది తీర్పు ప్రకటించేవరకు ఆయనను అరెస్టు చేయవద్దని ఏసీబీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ 31 వరకు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కోసం విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా డబ్బు చెల్లించారని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేటీఆర్‌పై ఏసీబీ డిసెంబర్ 19న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ-1గా కేటీఆర్, ఏ-2గా నాటి స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, ఏ-3గా హెచ్ఎండీఏ నాటి చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి పేరును చేర్చారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి, దానకిశోర్ తరఫున సీవీ మోహన్‌రెడ్డి, కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ దవే వాదనలు వినిపించారు. వాదనలు ముగియడంతో న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. తుది తీర్పు వెల్లడించేవరకు కేటీఆర్‌ను అరెస్టు చేయరాదని ఆదేశించారు.

### అవినీతి లేనప్పుడు సెక్షన్లు ఎలా పెడతారు?

అవినీతే లేనప్పుడు కేసు ఎలా నమోదుచేస్తారని కేటీఆర్ తరఫు న్యాయవాది సిద్దార్థ దవే వాదించారు. 'ఫార్ములా %-%ఈ రేసు నిర్వహణ ఒప్పందంలో ముందుగా పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సంతకం చేశారు. అనంతరం కేటీఆర్ నోట్ ఫైల్‌పై సంతకం చేశారు. ఆ శాఖ మంత్రిగా ఉన్నంత మాత్రాన కేటీఆర్‌ను నిందితుడిగా చేర్చడం సరికాదు. ఈ చెల్లింపుల్లో అవినీతి జరిగినట్లు గానీ, వ్యక్తిగతంగా కేటీఆర్ లబ్ధి పొందినట్లుగానీ ఏసీబీ పేర్కొనలేదు. అందుకు ఎలాంటి ఆధారాలు లేవు. అలాంటప్పుడు అవినీతి నిరోధక (పీసీ) చట్టంలోని సెక్షన్ 13(1)(ఏ), 13(2) కింద కేసు పెట్టడం చెల్లదు. ఇది సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం. లబ్ధి చేకూర్చినట్లు చెబుతున్న సంస్థపై కేసు పెట్టలేదు. నగదు చెల్లింపు బ్యాంక్ ద్వారానే జరిగింది. బిజినెస్ రూల్స్ ఉల్లంఘించారని చెబుతున్నా.. చట్టప్రకారం ప్రతి ఉల్లంఘన క్రిమినల్ నేరం కిందకు రాదు. ఎన్నికల కోడ్ సమయంలో పాలసీ నిర్ణయాలు తీసుకోకూడదు. కానీ, ముందే ఉన్న ఒప్పందాన్ని అమలు చేయవచ్చు. డిసెంబర్ 18 ఫిర్యాదు చేస్తే 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలి'అని విజ్ఞప్తి చేశారు.

### ప్రజా ప్రతినిధులకూ సెక్షన్ 405 వర్తిస్తుంది..

సిద్దార్థ దవే వాదనను ఏజీ తీవ్రంగా వ్యతిరేకించారు. '2023, అక్టోబర్ 30న సీజన్ 10కు సంబంధించి రెండో ఒప్పందం జరిగింది. కానీ, అక్టోబర్ 3న రూ.22,69,63,125 (పన్నులు అదనం), 11న రూ.23,01,97,500 (పన్నులు అదనం) చెల్లించారు. అంటే ఒప్పందానికి ముందే మొత్తం రూ. 54,88,87,043 చెల్లింపులు - మిగతా 2వ పేజీలో




# సీఎం రేవంత్‌కు పాస్ మార్కులు కూడా రాలే!

## కాంగ్రెస్ ఏడాది పాలన బోనస్ హామీలు.. బోగస్ మాటలు
## అయితే లూటీలు.. లేదంటే లాఠీలు అన్నట్లుగా పనితీరు: హరీశ్‌రావు విమర్శలు

హైదరాబాద్ /సిద్దిపేట అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ఎన్ని సంస్థలు సర్వేలు చేసినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాస్ మార్కులు కూడా రావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎ మ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గ్యారంటీల అ మలుకు బదులుగా ప్రభుత్వం గారడీ విన్యాసా లు చేస్తోందని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'డిక్లరేషన్ల అమలుకు బదులుగా డైవర్షన్ రా జకీయాలు చేస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారు. పంటలకు బోనస్ అంటూ ఇప్పుడు బోగస్ మాటలు చెప్తున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న చెక్కులు బౌన్స్ అవుతున్నాయి. బీఆర్ఎస్ నేతలపై క్షణాల్లో కేసులు నమోదు చేస్తూ, కాంగ్రెస్ నేతలపై వచ్చే ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా సీఎం ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థలను వక్రమార్గం పట్టిస్తూ.. అయితే లూటీ లేకుంటే లాఠీ అన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారు. ఏడాదిలో కాంగ్రెస్, బీజేపీ స్నేహం మరింత బలపడింది' అని హరీశ్‌రావు విమర్శించారు. పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఆరు వేల మంది రిసోర్స్ పర్సన్ల కు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని మండిపడ్డారు. వారి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

### విద్యార్థులకు బట్టలు కూడా ఇవ్వలేదు

కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకొని అమలు చేయలేక విఫలమవుతోందని హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లిలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో మంగళవారం ఆయన విద్యార్థులకు దుప్పట్లు, టీషర్టు లు పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మెనూకు.. హాస్టళ్లలో అమలవుతున్న మెనూకు సంబంధమే లేదని అన్నారు. పిల్లలకు ఇప్పటివరకు కనీసం బట్టలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రభుత్వంతో మాట్లాడి పెండింగ్ మెస్ బిల్లులు, కాస్మొటిక్ ఛార్జీలు ఇప్పిస్తానని, మంచిగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించినవారికి తన సొంత ఖర్చులతో ఐప్యాడ్‌లు అందజేస్తానని, మెడిసిన్ చదివిస్తానని హామీ ఇచ్చారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
బుధవారం, 01 జనవరి, 2025

# తుది తీర్పు వరకు కేటీఆర్ అరెస్టు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఫార్ములా ఈ రేసు ఆపరేషన్స్ (ఎఫ్ఈవో), మున్సిపల్ శాఖ మధ్య 2023, అక్టోబర్‌లో ఒప్పందం కుదిరింది. విదేశీ మారక ద్రవ్యం (పౌండ్) రూపంలో చెల్లింపులకు ఆర్‌బీఐ నిబంధనలు, బిజినెస్ రూల్స్‌ను తప్పకుండా పాటించాలి. కానీ పాటించలేదు. హెచ్ఎండీఏ నుంచి రూ.10 కోట్లకు మించి ఎలాంటి చెల్లింపులు జరిపినా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలి. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా కేటీఆర్ నోట్ ఫైల్‌కు ఆమోదం తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే ఫార్ములా %-%ఈ రేసు ఒప్పందం చేసుకున్నారు. ఎఫ్ఈవోకు డబ్బులు చెల్లించాల్సిన బాధ్యత రేసు ప్రమోటర్ ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌ది. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే కోర్టులను ఆశ్రయించవచ్చు. కానీ, ప్రమోటర్‌ను రక్షించడం కోసమే చెల్లింపులు జరిపినట్లుగా ఉంది. నిబంధనలు విరుద్ధంగా చెల్లింపులు జరిగినందునే ఈడీ కూడా కేసు నమోదు చేసింది. ఐపీసీ సెక్షన్లు 405, 409 ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తాయి. చంద్రబాబునాయుడు వర్సెస్ ఏపీ కేసులో సుప్రీంకోర్టు ఇదే విషయాన్ని చెప్పింది. అందువల్ల ఈ పిటిషన్‌ను కొట్టివేయండి' అని ధర్మాసనాన్ని కోరారు. సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఈ లావాదేవీల్లో అవినీతి జరిగిందా? డబ్బులు ఎలా వెళ్లాయి? మళ్లీ వచ్చాయా.. లేదా? అనేది విచారణలో తేలుతుంది. నిబంధనలు ఉల్లంఘన జరిగినప్పుడు దర్యాప్తు చేపట్టే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ నగదు చెల్లింపులో ఉల్లంఘన జరిగితే సెక్షన్ 405 వర్తిస్తుంది. మంత్రి ఆదేశాలతోనే చెల్లింపులు జరిగాయి' అని వాదించారు.

**ఏజీకి న్యాయమూర్తి సూటి ప్రశ్నలు..**

**నిందితుడిపై ఉన్న ఆరోపణలు ఏంటి?**

గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా నగదు చెల్లింపులకు పాల్పడ్డారు. అవినీతి నిరోధక చట్టం, నేరపూరిత కుట్ర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

**'ఫార్ములా- ఈ' ప్రమోటర్ సంస్థను నిందితుల జాబితాలో చేర్చారా?**

లేదు. దర్యాప్తులో భాగంగా నిందితులను చేర్చడం, తొలగించడం జరుగుతుంది.
దర్యాప్తు ఏ దశలో ఉంది? ఎంత మంది స్టేట్‌మెంట్ రికార్డు చేశారు?
దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది. వీలైనంత త్వరగా ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. ఫిర్యాదుదారు దానకిశోర్ స్టేట్‌మెంట్ రికార్డు చేశాం. నిందితుల స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉంది.

**ఇతర నిందితులు ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా?**

ప్పటివరకు ఎలాంటి పిటిషన్లు వేయలేదు. ఎవరినీ అరెస్టు చేయలేదు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

**ప్రమోటర్ గ్యారంటీ సమర్పించారా? దాన్ని క్యాష్ చేసుకున్నారా?**

దర్యాప్తులో ఆ వివరాలు సేకరించాల్సి ఉంది.

# స్థానిక సమరానికి కాంగ్రెస్ రెఢీ

**హామీల అమలుకు అడుగులు వేస్తున్న ప్రభుత్వం**

**కొత్త ఏడాదిలో మరిన్ని హామీల అమలు!**

**ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాతో మరింత సానుకూలత!**

**హైదరాబాద్, డిసెంబర్ 31:** స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు అధికార కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందుకు అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అభయహస్తం పథకం ప్రకటించి.. ఆరు గ్యారెంటీల్లో కొన్నింటిని అమలుచేసిన సర్కార్, మిగతా వాటిని కూడా జనవరిలో అమలు చేయనుంది. జనవరి చివ రి వారం లేదంటే ఫిబ్రవరిలో పంచాయ తీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి సత్తా చాటా లనే ప్రయత్నంలో కాంగ్రెస్ నేతలున్నారు. 2023 డిసెంబర్‌లో అధికారం చేపట్టామని.. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను జీరోకు తీసుకెళ్లామని, ఇక స్థానిక ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఖాతాలేకుండా చేస్తామని కాంగ్రెస్ నేతలు అంటు న్నారు. బీజేపీకి గ్రామాల్లో పెద్దగా పట్టులేదన్న ఆలోచనతో హస్తం పార్టీ నేతలున్నారు. ఈ నెలలోనే ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాతో పాటు భూ సమస్యల పరిష్కారం కో సం తీసుకొచ్చిన భూ భారతి చట్టం 2024 ను విస్తృత ప్రచారం చేసుకోవాలనే ఆలోచనతో అధికార కాంగ్రెస్ నేతలున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో మొత్తం 4.50 లక్షల ఇళ్లను ఈ ఏడా దిలో పూర్తి చేయాలనే లక్ష్యంతో సర్కార్ ముందుకెళ్లనుంది. ఇక రైతు భరోసా పథకాన్ని ప్రారంభించడంతో రైతుల్లోనూ ఆనం దం వెల్లివిరుస్తుందని, తద్వారా పంచాయతీ ఎన్నికల్లో పాగా వేయవచ్చనే అభిప్రాయం తో ఉన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకం పరిధిని రూ. 5 లక్షల నుం చి రూ. 10 లక్షలకు పెంచింది. ఆ తర్వాత రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీకి ప్రభు త్వం రూ. 22 వేల కోట్ల వరకు ఖర్చు చేసిందని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల కాలంలో భర్తీచేయని ఉద్యోగాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 55 వేల వరకు భర్తీచేసిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు ప్రజలకు వివరించనున్నారు. వీటితో పాటు మిగతా సం క్షేమ పథకాల అమలును కూడా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలనే ఆలోచనతో ఉన్నారు.

# రేపటి నుంచి టెట్

**పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు.. 15 నిమిషాల ముందే గేట్లు క్లోజ్**

**హైదరాబాద్, డిసెంబర్ 31:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. జన వరి 2 నుంచి 20 వరకు పది రోజులపాటు 20 సెషన్లలో నిర్వహించనున్నది. ఈ పరీక్షలకు 2,75,773 మంది హాజరుకానున్నా రు. టెట్ రాతపరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. ప్రతి రోజు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. సెషన్ ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు, సెషన్ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. పేపర్ పరీక్షలను జనవరి 8, 9, 10, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. పేపర్ -2 పరీక్షలు జనవరి 2, 5, 11, 12, 19, 20వ తేదీల్లో ఉంటుంది.

**మెహందీతో వస్తే అనుమతి ఉండదు:** పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అధికారులు పలు సూచనలు చేశారు. మెహం దీతో వస్తే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఇప్పటికే స్పష్టంచేశారు. స్మార్ట్ వాచీలతోపాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. హాల్‌టికెట్లపై సూచించిన నిబంధనలను అభ్యర్థులు తప్పకుండా పాటించాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు రెండు గంటల ముం దే చేరుకోవాలని కోరారు. ఉదయం సెషన్ కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 7.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే వారిని మ.12.30 గంటల నుంచి లోనికి అనుమతిస్తారు.- పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లను మూసివేస్తారు. సెషన్ ఉ.8.45 గంటలకు, సెషన్ మధ్యాహ్నం 1.45 గంట లకు గేట్లను మూసివేయనున్నారు.- అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్, గుర్తిం పు కార్డు (ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ)లను తమ వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది.

**దూర ప్రాంతాల్లో సెంటర్లు...:** ఇదిలా ఉంటే ఆప్షన్ పెట్టుకున్న జిల్లాలకే కాకుండా పెట్టని జిల్లాల్లోనూ సుదూర ప్రాం తాల్లో పరీక్షా కేంద్రాలు పడటంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక జిల్లాల నుంచి 100 నుంచి 300 కిలోమీటర్ల వరకు దూరంలో సెంటర్లు పడటంతో ఎలా వెళ్లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకోగా, పక్క జిల్లాలను కేటాయించారని మండిపడుతున్నారు. అంతంత దూరం వెళ్లి పరీక్షలు ఎలా రాయాలని నిలదీస్తున్నారు.

# సంక్రాంతికే భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేసే 'సెల్ఫ్ డిక్లరేషన్' నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని కూడా మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. శాటిలైట్ ఇమేజ్, రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా రైతు సాగు చేసిన భూమిని లెక్కగట్టనున్నారు. అలాగే వ్యవసాయాధికారి ఇచ్చే పంటల విస్తీర్ణంతో రైతు నుంచి తీసుకున్న 'సెల్ఫ్ డిక్లరేషన్'ను సరిపోల్చుకున్న తర్వాతే పెట్టుబడి సాయాన్ని రైతు ఖాతాలో జమ చేస్తారు. రైతే స్వయంగా తన పేరిట ఉన్న భూమి, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను తెలియజేయడంతో పాటు తాను ఎంత విస్తీర్ణంలో ఏ పంట వేస్తున్నాననే విషయాన్ని ప్రకటించేలా చూడటం ద్వారా రైతుల్లో జవాబుదారీతనాన్ని పెంచవచ్చనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. తద్వారా ప్రభుత్వ సొమ్ము దారి మళ్లకుండా రైతు సాగు చేసిన భూమికే కచ్చితంగా పెట్టుబడి సాయం అందుతుందని భావిస్తోంది.

**సాగు విస్తీర్ణంలో కచ్చితత్వం కోసమే అంటున్న సర్కారు**

రైతు అందించే సెల్ఫ్ డిక్లరేషన్ వల్ల ఒక గ్రామంలో ఉన్న పట్టా భూమి ఎంత? అందులో సాగవుతున్న విస్తీర్ణం ఎంతో తెలియడమే కాకుండా రాష్ట్రంలో సాగవుతున్న పంటల వివరాలు కూడా కచ్చితంగా తెలుస్తాయని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి సీజన్‌లో ఇచ్చే పంటల సాగు విస్తీర్ణం లెక్కల్లో కచ్చితత్వం ఉండడం లేదని భావిస్తున్న ప్రభుత్వం.. రైతు భరోసా పథకం ద్వారా ఈ వివరాలను కూడా తెలుసుకోవాలని నిర్ణయించింది. ఉదాహరణకు ఈ యాసంగిలో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 63.54 లక్షల ఎకరాలు కాగా, రైతులు ఏకంగా 79.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ లెక్కలు వేసింది. ఇందులో వరి 63.20 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 7.18 లక్షల ఎకరాల్లో సాగవుతుందంటూ ప్రతిపాదనలు రూపొందించింది. అయితే ఇప్పుడు రైతు భరోసాకు రైతు సెల్ఫ్ డిక్లరేషన్ నిబంధన వల్ల ఈ పంటలకు సంబంధించి కచ్చితమైన వివరాలు తెలిసే అవకాశం ఉందని, అలాగే ఏ పంటల లోటు ఎంత ఉందో తెలుసుకుని తదనుగుణంగా ఆయా పంటల విస్తీర్ణం పెంచే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే పంట సాగు చేస్తేనే పెట్టుబడి సాయం అందుతుందనే నిబంధన వల్ల..గతంలో పునాసలో మాత్రమే సాగు చేసే రైతు యాసంగిలో కూడా తప్పకుండా ఏదో ఒక పంట పండించేందుకు ఆసక్తి చూపుతారని, తద్వారా యాసంగిలోనూ సాగు విస్తీర్ణం పెరుగుతుందని మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయపడింది.

**ఎంత పెద్ద రైతుకైనా భరోసా ఖాయం!**

రైతు భరోసా కింద ఒక్కో సీజన్‌లో ఎకరాకు రూ.7,500 చొప్పున చెల్లించాలని భావిస్తున్నప్పటికీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో దీనిని ఎంతకు పరిమితం చేయాలనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. జనవరి 2 లేదా 3వ తేదీన ఉపసంఘం మరోసారి సమావేశమై దీనిపై చర్చించే అవకాశం ఉంది. అదే సమయంలో ఒక్కో రైతుకు ఎన్ని ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాలనే అనే అంశాన్ని కూడా ఖరారు చేయనున్నట్లు సమాచారం. అయితే ఎంత పెద్ద రైతైనా నిర్ణీత సీలింగ్ పరిధికి లోబడి సాగు చేసిన భూమికి రైతు భరోసా ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించారు. పీఎం కిసాన్ పథకంలో ఐదెకరాలు పైనున్న భూ యజమానికి పెట్టుబడి సాయం అందని విషయం విదితమే. రైతు భరోసాకు సంబంధించిన విధివిధానాలతో కూడిన నివేదికను మంత్రివర్గ ఉప సంఘం 3వ తేదీలోపు ప్రభుత్వానికి అందజేస్తే 4వ తేదీన జరిగే కేబినెట్ భేటీలో ఆమోదముద్ర పడే అవకాశం ఉంది.

# 15 రోజుల్లో ఇరిగేషన్ ఇంజనీర్లకు ప్రమోషన్లు

**నీటిపారుదల శాఖలో మరో 1,300 ఉద్యోగాల భర్తీ**

**ఇంజనీర్లు కచ్చితంగా పని ప్రదేశాల్లోనే నివసించాలి**

**నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**ఇరిగేషన్‌ను అస్తవ్యస్తం చేసిందని ఆగ్రహం**

**ఆర్ఆర్ఆర్‌ను గాడిలోకి తెచ్చింది నేనే: మంత్రి కోమటిరెడ్డి**

హైదరాబాద్: నీటిపారుదల శాఖలోని అన్ని స్థాయిల ఇం జనీర్లకు 15 రోజుల్లోగా పదోన్నతులు, బదిలీలు చేపడుతా మని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంజ నీర్లు పనిచేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలని స్పష్టంచే శారు. బాధ్యతలను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రిం చారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సాగు నీటి ప్రాజెక్టులపై మంగళవారం జలసౌధలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహిం చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మిర్యాలగూడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను మంత్రి సస్పెండ్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

**మరో 1,300 మంది నియామకం**

ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టేందుకు 700 మందికి పైగా ఏఈఈలను నియమించామని, అందులో దాదాపు 100 మంది ఐఐటీ, ఎన్ఐటీల గ్రాడ్యుయేట్లు ఉన్నారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కాల్వలపై పర్యవేక్షణకు 1,800 మంది లష్కర్లను నియమిస్తున్నామని చెప్పారు. నీటిపారుదల శాఖలో మరో 1,300 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని టీజీపీఎస్సీకి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల కృష్ణా జలాల వాటా నుంచి రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలను కేటాయించడాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రాతపూర్వకంగా సమ్మతించిందని తప్పుబట్టారు. తెలంగాణకు 550 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట వాదనలు వినిపిస్తున్నామని, ఆరు నెలల్లో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**అప్పుల చెల్లింపులకే సగం నిధులు**

బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో నీటిపారుదల శాఖ అస్తవ్యస్తంగా మారిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాల్వల నిర్వహణను నాడు పూర్తిగా గాలికి వదిలేశారని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కారు రూ.1.81 లక్షల కోట్లు అప్పు చేసినా ఆయకట్టు మాత్రం అభివృద్ధి కాలేదని అన్నారు. ఈ అప్పులభారం నీటిపారుదల శాఖపై తీవ్రంగా పడిందని తెలిపారు. బడ్జెట్‌లో ఈ శాఖకు రూ.22 వేల కోట్లు కేటాయిస్తే, రూ.11 వేల కోట్లు అప్పుల చెల్లింపులకే పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులను పునర్వ్యవస్థీకరించి, వడ్డీలను తగ్గించడంతో పాటు కాలపరిమితి పెంచడం ద్వారా శాఖపై భారం తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ప్రశాంతంగా వేడుకలు చేసుకోనీయండి: కోమటిరెడ్డి**

ఫార్ములా%-% ఈ రేసు కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ కేసు గురించి మీడియా ప్రశ్నించగా.. కొత్త సంవత్సరం సందర్భంగా కేటీఆర్‌ను రెండుమూడు రోజులు ప్రశాంతంగా వేడుకలు చేసుకోనీయండి అని సెటైర్ వేశారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం బీఆర్ఎస్ హయాంలోనే 70 శాతం భూసేకరణ పూర్తిచేశామన్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రకటనను కోమటిరెడ్డి కొట్టిపారేశారు. గత ప్రభుత్వం యుటిలిటీ చార్జీలు కట్టకపోతే ప్రాజెక్టు నిలిచిపోగా, తాను కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి ప్రాజెక్టును రివైవ్ చేయించినట్టు తెలిపారు. సమీక్షలో ఎమ్మెల్యేలు మందుల సామేలు, లక్ష్మారెడ్డి, బాలూనాయక్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ తరహాలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

**కార్యాలయాల పునర్వ్యవస్థీకరణకు నిర్ణయం**

**మొదటి దశలో నాలుగు జిల్లాల్లో నిర్మాణాలు**

**ప్రజలకు మరింత మెరుగైన సేవలకు అవకాశం**

**గచ్చిబౌలిలో మాడల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం**

**రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**హైదరాబాద్, డిసెంబర్ 31:** ప్రజలకు మరింత సమర్థంగా, పారదర్శకంగా సేవలను అందించడానికి సబ్-కార్యాలయాలను పునర్ వ్యవస్థీకరించడంతో పాటు కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో నిర్మించబో తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డితో కలిసి రంగారెడ్డి, హైదరా బాద్, మేడ్చల్ - మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు, వసతులు కల్పించడమే లక్ష్యంగా సబ్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ ఉండాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారు గంటల తరబడి చెట్ల కింద వేచి చూసే పరిస్థితి తొలిగిపోవాలని, ఇందుకోసం అవసరమైన భూములను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశిం చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలు ఉండగా, వాటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయని చెప్పారు. మొదటి దశలో సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, పటాన్ చెరువు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, రంగారెడ్డి జిల్లాకు సంబం ధించి కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫోర్త్ సిటీలో, గండిపేట, శేరిలింగంపల్లి, రంగారెడ్డి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కార్యాలయం, మూడు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్ మెంట్ (తాలిమ్) కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మిస్తున్నామని తెలి పారు. ఈ నెలలోనే దీనికి శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గచ్చిబౌలి ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం**

గచ్చిబౌలిలోని ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు మాడల్ గా ఉంటుందని పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ జిల్లాకు సంబంధించి బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, గోల్కొండ మూడు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను షేక్‌పేట్ ప్రాంతంలో ఒకేచోట నిర్మించాలని నిర్ణయించినట్టు పేర్కొ న్నారు. మొదటి దశలో నిర్మించే సబ్-రిజి స్ట్రార్ కార్యాలయాలు కనీసం మూడు ఎకరాల్లో ఉంటాయని, పది నుండి పదిహేను వేల స్క్వేర్ ఫీట్లలో భవన నిర్మాణం ఉంటుందని వెల్లడించారు. వెయిటింగ్ హాలు, తాగు నీటి సదుపాయం, విశాలమైన పార్కింగ్ వంటి వసతులు ఉండేలా డిజైన్ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇంటి గ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడటమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుందని అన్నారు. అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండటంతోపాటు దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవు తుందని పేర్కొన్నారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని నిర్మూలించేందుకు వీలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని అధికారు లకు సూచించారు. ఇందు కు సంబంధించిన కార్యాచరణను తక్షణమే రూపొందించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు.

# అనవసర వివాదాల్లోకి చిత్ర పరిశ్రమను లాగొద్దు: దిల్ రాజు



**హైదరాబాద్:** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎఫ్డీసీ ఛైర్మన్ దిల్ రాజు కీలక వ్యాఖ్యలు చెప్పారు. సీఎంతో సినీ ప్రముఖుల భేటీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అనవసర వివాదాల్లోకి తెలుగు చిత్ర పరిశ్రమను లాగొద్దని, పరిశ్రమకు లేనిపోని రాజకీయాలను ఆపాదించొద్దని దిల్ రాజు మండిపడ్డారు. రాజకీయ దాడి, ప్రతిదాడులకు పరిశ్రమను వాడుకోవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంతో జరిగిన సమావేశం చాటుమాటు వ్యవహారం కాదని, చిత్ర పరిశ్రమ బాగోగులపై స్నేహపూర్వకంగా చర్చ జరిగిందని అన్నారు. సీఎంతో సమావేశంపై చిత్ర పరిశ్రమ సంతృప్తిగా ఉందని దిల్ రాజు చెప్పారు. రాష్ట్రభివృద్ధిలో చిత్రపరిశ్రమ భాగస్వా మ్యాన్ని తెలంగాణ ప్రభుత్వం గుర్తించిందని హర్షం వ్యక్తం చేశారు. సామజిక సంక్షేమానికి సినీ పరిశ్రమ సహకారాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరినట్లు వెల్లడించారు. హైదరాబాద్ ను గ్లోబల్ హబ్ గా మార్చాలన్నది సీఎం సంకల్పమని గుర్తుచేశారు. సీఎం సంకల్పాన్ని చిత్ర పరిశ్రమ ప్రతినిధులంతా స్వాగతించినట్లు ఆయన పేర్కొన్నారు. లక్షలాది మందికి ఉపాధి ఇస్తున్న పరిశ్రమకు ప్రభుత్వ సహకారం కావాలని తాము కోరమని దిల్ రాజు తెలిపారు.

# కొండాపూర్ గెలాక్సీ అపార్ట్మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం



**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి కాలనీ గెలాక్సీ అపార్ట్మెంట్ 5వ అంతస్తులో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడటంతో స్థానికులు ఫైర్, పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వగా హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... 5వ అంతస్తులోని ఫ్లాట్‌లో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించినట్లు తెలిపారు. ఈ ప్రమాద సమయంలో పై అంతస్తులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ముప్పు తప్పిందని అన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# మియాపూర్ డివిజన్ పరిధిలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తాం

## పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లి, డిసెంబర్ 31(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీలో పలు సమస్యలను చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం, జలమండలి విభాగం అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాలనీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ నగర్ కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కలిపించినదుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానంగా స్థానిక ప్రజలకు కాలనీలో డ్రైనేజి సమస్యను పరిష్కరించి, సీసీ రోడ్లు వేయాలని, మంచి నీటి వ్యవస్థను మెరుగుపర్చలని, ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రశాంత్ నగర్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం కాలనీ లో పాదయాత్ర చేశారు. ప్రశాంత్ నగర్ కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు చేపడుతుమని డ్రైనేజి ఔట్ లెట్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, డ్రైనేజి సమస్యకు శాశ్వతంగా పరిష్కరిస్తామని అన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులు వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడలని, డ్రైనేజి ఔట్ లెట్ సమస్యను త్వరలోనే పరిష్కరించాలని అధికారులకు తెలియచేసారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తానని, ఎల్లవేళలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహాదేవ్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

### కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి



కూకట్‌పల్లి, డిసెంబర్ 31(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలకు కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగులకు అధికారులకు కార్మికులకు కర్షకులకు వ్యాపారస్తులకు స్వచ్ఛంద సంస్థ నాయకులకు విద్యార్థులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ 2025 సంవత్సరంలో ప్రజలందరూ ఆర్థికంగా ఎదగాలని ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని కొత్త సంవత్సరంలో ప్రజలు అష్ట ఐశ్వర్యాలు కలగాలని కోరుకున్నారు.

## జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు శుభాకాంక్షలు తెలిపారు. 2025 వ సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని మరింత పట్టుదల, కృషితో తో విజయాలను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి గెలుపునుందించే సంవత్సరం కావాలని కలెక్టర్ అభిలషించారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు బొకేలు, పుష్ప గుచ్చాలు తేవొద్దని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. అధికారులకు బొకేలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమని, అయితే వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు బొకేలు, పుష్ప గుచ్చాలు తేవొద్దని, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటివి అందించి పేద విద్యార్థులకు చేదోడువాదోడుగా నిలవాలని, వాటిని త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.



## ప్రజలందరికీ నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు అధికారులకు గ్రామ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్రాల మల్లేష్ ముదిరాజ్

వాయిస్ టుడే( నర్సాపూర్ మండల ప్రతినిధి మెదక్ జిల్లా) నర్సాపూర్ మండల్ ప్రజలకు మరియు పరిసర ప్రాంతాలకు ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు నూతన సంవత్సరంలో మీరు సుఖ సంతోషాలతో మీరు కలలు నెరవేరాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాము ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటామని తెలియజేసిన వారు గుర్రాల మల్లేష్ ముదిరాజ్ గుర్రాల అశోక్ లక్ష్మి ఎంపీటీసీ ముదిరాజ్ మాజీ తాజా సర్పంచ్ విజయ భాస్కర్ రాజ్ ముదిరాజ్ మాజీ వార్డు సభ్యులు మోడీ సత్యనారాయణ మోడీ ఎల్లయ్య మరియు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

## జనవరి 26న ముహూర్తం!



హైదరాబాద్: నగరంలో మొదటిసారిగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం నూతన సంవత్సరంలో అందుబాటులోకి రానుంది. జర్మన్ సాంకేతికతతో ఆటోమెటిక్‌గా 450 వాహనాలు నిలిపేలా నాంపల్లిలో 15 అంతస్తుల్లో నిర్మించిన భవనాన్ని గణతంత్ర దినోత్సవం రోజు(జనవరి 26)న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విదేశాల నుంచి నిపుణులు, సెన్సర్ల వంటి పరికరాలు ఈ వారంలో వచ్చే అవకాశముందని, తరువాత పదిరోజుల్లోనే పనులన్నీ పూర్తవుతాయని నిర్వాహకులు అంటున్నారు. కింది అంతస్తులో వాహనాలు నిలిపేందుకు నాలుగు టెర్మినల్స్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌పోర్టర్ షటిల్ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తుకు తీసుకెళ్లి ఖాళీగా ఉన్న స్థలంలో పార్క్ చేస్తుంది. మూడు, నాలుగు అంతస్తుల్లో.. 180 సీట్లతో ఒకటి, 130 సీట్లతో మరోటి రెండు సినిమా తెరల పనులు జరుగుతున్నాయి. వీటిపైన పార్కింగ్ సముదాయం ఉంటుంది.



## ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డిని కలిసిన రామంతాపూర్ కురుమ సంఘం నాయకులు

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డిని రామంతాపూర్ కురుమ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. రామంతాపూర్ కురుమ సంఘం,బీరప్ప దేవాలయ కమిటీ,ఎల్లమ్మ దేవాలయ కమిటీ,రామంతాపూర్ కురుమ యూత్ నూతన కమిటీలు నియామకం ఇటీవల జరిగింది. దీంతో ఆయా సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా మంగళవారం పరమేశ్వర్ రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమం లో రావుల జంగయ్య,రేవు కృష్ణ,శగా శ్రీధర్ ,బండ అంజయ్య,శగా శ్రీనివాస్,శగా రవీందర్,కవిడే శ్రీశైలం,బాలం బిక్షపతి ,రేవు పరంధామ,రేవు బీరప్ప,కంకల్లా వెంకటేష్ ,కవిడే యాదయ్య ,శ్రీధర్ ,బలం శ్రీనివాస్,రావుల మహేష్ పాల్గొన్నారు.



## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### :- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం రామంతపూర్ లోని వి ఐస్ఫూర్తి ఉమెన్స్ డిగ్రీ కళాశాల లో ఏర్పాటు చేసిన ఫెస్ట్ కి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పట్టాలను అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ సురేష్, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయి జెన్ శేఖర్, ప్రశాంత్ గౌడ్, పవన్, సురం శంకర్, జహాగీర్ తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ సనాతన ధర్మం అంతరాత్మ గోమాత

### బిజెపి మేడ్చల్ ఇంచార్జీ ఏనుగు సుదర్శన్ రెడ్డి
### మేడ్చల్ బీజేవైఎం అధ్యక్షులు పవన్ రెడ్డి

వాయిస్ టుడే న్యూస్, డిసెంబర్ 31 మేడిపల్లి : భారతీయ మరియు హిందూ సమాజానికి ఆయువుపట్టు లాంటి అంశం గోమాతను సేవించడం అటువంటి గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని హత్తర ఉద్దేశంతో కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు సుమారు 4900 కిలోమీటర్లు 14 రాష్ట్రాల గుండా ప్రయాణం చేస్తున్నటువంటి బాలకృష్ణ గురుస్వామి మహాపాదయాత్రను చౌటుప్పల్లో కలిసి సంఘీభావం మరియు తన యొక్క సంతోషాన్ని వ్యక్తం చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు బిజెపి మేడ్చల్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరతరాలుగా భారత జీవన విధానం పూర్తిగా గోవుతో ముడిపడి ఉన్నదని అటువంటి గోవును జాతీయ ప్రాణిగా గుర్తించాల్సిన అవసరం ఆవశ్యకతను వివరిస్తూ గోమూత్రం జీవామృతం వంటి అంశాలను తెలియజెప్పుతూ ముందుకు సాగుతున్న బాలకృష్ణ స్వామి మరియు వారి బృందం అవిరాల శ్రమకు ఫలితం తప్పక సిద్ధించాలి అని కోరుకుంటున్నట్టు తెలిపారు. అదేవిధంగా కబేళాలకు అక్రమంగా తరలిస్తున్న గోవులను కాపాడుతున్న గౌరక్షకుల పట్ల పోలీసులు తీరు మారాలని హెచ్చరించారు.




# ప్రభుత్వ భూమిపై అఖిలపక్ష కమిటీ ఫిర్యాదు




వాయిస్ టుడే న్యూస్, డిసెంబర్ 31 మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12, వ13,వ డివిజన్లలో గౌతమ్ నగర్, దేవేందర్ నగర్, రాజీవ్ నగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ ఫేస్ త్రీ ,కాలనీ లో ప్రభుత్వ స్థలం సర్వేనెంబర్ 63/1, 63/26 నుండి 63/38 వరకు గల ఈ భూమిపై బోడుప్పల్ అఖిలపక్ష కమిటీ అధ్యక్షులు వై.బాలరాజ్ గౌడ్, ఆధ్వర్యంలో సోమవారం రోజున తెలంగాణ రాష్ట్ర హైడ్రా కమిషనర్ రంగనాథ్ కి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం లో ఫిర్యాదు చేయడం మంగళవారం రోజున మేడిపల్లి తాహాసిల్దార్ హాసినా కి, బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ కి, రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వై. బాలరాజ్ గౌడ్, మాట్లాడుతూ.బోగస్ పత్రాలతో ప్రభుత్వం స్థలంలో మాయం చేస్తున్నారు. రాష్ట్రం మొత్తం ప్రభుత్వ భూమిని కాపాడాలని సీఎం రేవంత్ రెడ్డి, అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇక్కడ అధికార పార్టీ నాయకులు స్వేచ్ఛగా దర్జాగా కబ్జాలు చేస్తుంటే, ఇక్కడ అధికారులు మాటుకు చూసి చూడనట్లుగా, కాంగ్రెస్ పార్టీ దళారులు దగ్గర లావాదేవులు తీసుకుంటూ భూ కబ్జాదారుల పై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు అనుచరులతో ప్రభుత్వ భూమిని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ భూమిలో రోజుకోచోట కబ్జాలు చేస్తూ నిర్మాణాలు చేసుకుంటూ కోట్లకు పడిగెత్తుతున్నారు. ఇక్కడ ఎలాంటి చర్యలు ఉండవు ప్రశ్నించిన వారిపై తిరుగుబాటు చేయిస్తుంటారు. బోడుప్పల్ పాలకవర్గం గత మూడు నెలల క్రింద అధికార కాంగ్రెస్ పార్టీ గా మేయర్ తోటకూర అజయ్ యాదవ్, ఆధ్వర్యంలో పాలకవర్గం ఏర్పడి మూడు నెలలు గడుస్తుంది. ఈ మూడు నెలల్లో చివరి ఈ నెల ఉన్నందున ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు సుమారు మూడు కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. అయినా చూచి చూడనట్లుగా అక్రమ నిర్మాణాలను తొలగించినారు. ఇప్పుడు ఏకంగా సుమారు 1200 గజాలకు అక్కడక్కడ కాలి స్థలాల్లో పూర్తిగా కబ్జా చేసుకుని కోట్లకు పడిగెత్తుతామని ప్రయత్నాలు చేస్తున్నారు. అని తెలిపినారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ ప్రధాన కార్యదర్శి చీరాల జంగయ్య, సలహాదారులు ఏనుగుల లక్ష్మయ్య, సాయినీ అమృతం, రాపోలు శంకరయ్య, తలారి కృష్ణ యాదవ్, రాపోలు రమేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ ఫిర్యాదు తో మేడిపల్లి తాహసిల్దార్ హసీనా, మాట్లాడుతూ.. త్వరలో ప్రభుత్వ స్థలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకొని ఎవరు కబ్జా చేసినా కఠినంగా శిక్ష పడుతుందని పై అధికారులు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఎట్టి పరిస్థితుల్లో కబ్జాదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపినారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
బుధవారం, 1 జనవరి 2025



## కరీంనగర్ సౌత్ జోన్ బిజెపి పోలింగ్ బూత్ కమిటీ ఎన్నిక

కరీంనగర్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31(వాయిస్ టుడే)భారతీయ జనతా పార్టీ సంఘటన పర్వ్ –2024లో భాగంగా కరీంనగర్ సౌత్ జోన్ పరిధిలోని 11, 12 , 32 డివిజన్లకు చెందిన పోలింగ్ బూత్ లకు ఎన్నికల సమావేశాన్ని నిర్వహించి, నూతన కమిటీలకు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 32 డివిజన్ లోని 285 పోలింగ్ బూత్ అధ్యక్షునిగా సౌడోజ్ అభిలాష్,286 కి మాషం వెంకటేశం,287 కి జెట్టి సంతోష్, 322 కిఅల్లి ప్రశాంత్ , 323 కి నాంపల్లి వెంకటేష్, 324 శ్రీనివాస్, లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 11వ,12వ డివిజన్ లోని ఆరు బూత్ కమిటీలకు ఏకగ్రీవంగా అధ్యక్షులను ఎన్నుకున్నారు. 291 పోలింగ్ బూత్ అధ్యక్షునిగా కోమటిపల్లి అరుణ్, 292 గంకిడి శ్రీకాంత్ రెడ్డి, 293 బొడ్ల శ్రవణ్ కుమార్ , 294 పిట్టల సుమంత్, 295.నాంపల్లి రమేష్ , 296 వంగ సంపత్ పటేల్ లు ఏకగ్రీవ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. సౌత్ జోన్ కన్వీనర్ నాంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల సమావేశం లోఎన్నికల అధికారి సింగిరెడ్డి కృష్ణారెడ్డి , కళ్లెం వాసుదేవ రెడ్డి, టౌన్ టూ కోఆర్డినేటర్ గుంజేటి శివకుమార్ కన్వీనర్ అడిచెర్ల రాజు , రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి బండారి గాయత్రి , రామకృష్ణారెడ్డి, నాగేవల్లి భాస్కర్, బైరి శ్రీనివాస్ , కాల్వ పూర్ణచందర్ రెడ్డి , గున్నాల కన్నాంబ , నల్లాల ఓదెలు, చిలక నరసప్ప, పురం హరి, తిప్పారపు శ్రీనివాస్ , విజయ్, దేవసాని వేణు, దాడి శంకర్, ఓంకారం రఘు, మరియు బిజెపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు. .

## ఖనిలో పట్టపగలే యువకుడిపై హత్యయత్నం

పెద్దపల్లి జిల్లా: డిసెంబర్. 31 (వాయిస్ టుడే) గోదావరిఖని: పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గ లోని గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ స్టేడియంలో పట్టపగలే ఓ యువ కుడిపై గుర్తుతెలి యని వ్యక్తి కత్తులతో దాడి చేశారు. వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి, తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వినోభా నగర్ కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తిపై కుటుంబ కలహాల్లో జోక్యం చేసుకుంటున్నాడని కక్షల నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు మాట్లాడుకుందా మని,పిలిచి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ లో విచక్షణ రహితంగా దాడి చేశారు. శ్రీనివాస్ కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు పోలీ సులు,కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సంఘటనకు సంబంధించిన మరింత సమాచారం తెలియాల్సి ఉంది...



## లోయర్ మానేరు జలాశయం నుంచి ఆయకట్టుకు నీటి విడుదల

### స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31 ( వాయిస్ టుడే) యాసంగి సీజన్ కు గాను లోయర్ మానేరు జలాశయం నుంచి కాకతీయ కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగు నీటి విడుదలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు.జలాశయం నీటిలో పూలను చల్లి రెగ్యులేటర్ గేట్ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి కెనాల్ కు నీటి విడుదల ప్రారంభించారు. ఆయకట్టు విస్తీర్ణం, జలాశయం సామర్థ్యం, విడుదల చేస్తున్న నీటి కెపాసిటీ గురించి నీటిపారుదల శాఖ ఎస్.ఈ పెద్ది రమేష్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నీటి విడుదల కొనసాగించాలన్నారు. యాసంగి సీజన్ కు గాను మొత్తం 44.480 టి.ఎం.సిల నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎస్.ఈ రమేష్ తెలిపారు. మొత్తం 6 లక్షలా 97 వేలా 708 ఎకరాలకు వచ్చే మార్చి 31 వరకు నీటి విడుదలను కొనసాగిస్తామని తెలిపారు. జోన్ 1, జోన్ 2 పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలను కొనసాగిస్తామన్నారు. రోజుకు 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామని తెలిపారు.11 టీఎంసీల నీటిని మధ్య మానేరు ద్వారా, ఐదు టీఎంసీల నీటిని ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా సేకరించి విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం లోయర్ మానేరు జలాశయంలో 22.870 టిఎంసిల నీటి నిలువ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ నాగభూషన్ రావు, డి.ఈ శ్రీనివాస్, ఏఏఈలు వంశీధర్, దీపిక, సంజన, కిరణ్ పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ఎఫెక్ట్ కామారెడ్డి డి.ఎస్.పి బదిలీ..!




కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: కామారెడ్డి డిఎస్పీ నాగేశ్వర్ రావు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయానికి బదిలీ ఉత్తర్వులు వచ్చినట్టుగా తెలుస్తోంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 20 నా కామారెడ్డి డిఎస్పీగా నాగేశ్వర్ రావు బాధ్యతలు చేపట్టారు. 10 నెలల పాటు ఆయన ఇక్కడ విధులు నిర్వర్తించారు. అయితే విధి నిర్వహణలో డిఎస్పీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల బిక్కనూర్ మండలంలో ఫోక్సో కేసులో విచారణ అధికారిగా కామారెడ్డి డిఎస్పీని కాకుండా ఎల్లారెడ్డి డిఎస్పీకి అప్పగించారని ప్రచారం సాగింది. వీటితో పాటు డిఎస్పీ మాట తీరు కూడా సరిగా ఉండదని తెలుస్తోంది. ఇటీవల ఓ జర్నలిస్టు పట్ల దురుసుగా మాట్లాడిన విషయంపై తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్, %చీఖజీ (×%) జిల్లా నాయకులు అధ్యక్షుడు వేణు జిల్లా అడిషనల్ ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం కూడా డిఎస్పీ బదిలీకి కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం డిఎస్పీని జిల్లా ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి పోస్టింగ్ ఎక్కడ ఇస్తారనేది ఇంకా తెలియరాలేదు. అయితే అడిషనల్ ఎస్పీగా కొత్తగా వచ్చిన చైతన్య రెడ్డి కామారెడ్డి డిఎస్పీగా వ్యవహరించనున్నట్టు సమాచారం.

## కామారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ధర్మగోని లక్ష్మి



కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: కామారెడ్డి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ధర్మగోని లక్ష్మి రాజగౌడ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ ఛైర్మన్‌గా మినుకూరి బ్రహ్మానంద రెడ్డితో పాటు మరొక 12 మంది సభ్యులతో నూతన కమిటీ నియమించారు. త్వరలోనే నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయనుంది.

## బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడి గా కుమ్మరి యాదగిరి



కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31 : కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేత ఆధ్వర్యంలో బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేత మాట్లాడుతూ బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడి గా పిట్లంకు చెందిన కుమ్మరి యాదగిరి ని నియమించడం జరిగిందన్నారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేత గారికి, ఇతర రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ జిల్లాలో సంఘం అభివృద్ధికై కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాదికార సమితి రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేత, చింతల శంకర్, రాజయ్య, శ్రావణ్ కుమార్ గౌడ్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి రాజేందర్, సదాశివ నగర్ మండల్ ఇన్చార్జి రాజు, కామారెడ్డి పట్టణ నాయకులు అల్వాల గోపాల్, పెంటయ్య, పిట్లం బుబు మేస్త్రి, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.



## 6 నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

### పీ.హెచ్.సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31(వాయిస్ టుడే)మహిళలందరికీ ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్యపరీక్షలు తప్పనిసరిగా చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. మానకొండూర్, శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆరోగ్య మహిళ ద్వారా పరీక్షలు చేయించుకుంటున్న వారి వివరాల రిజిస్టర్ ను పరిశీలించారు. ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్ ల్యాబ్, వార్డులను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళ కార్యక్రమంలో పరీక్షల వేగం పెంచి నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. మహిళలందరికీ వైద్య పరీక్షలు పూర్తి చేయాలని, ఆరు నెలలు దాటిన వారికి మరో దఫా పరీక్షలు ప్రారంభించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నందున ఇన్ పేషెంట్ సంఖ్య పెంచాలని తద్వారా ప్రధాన ఆసుపత్రికి రోగుల తాకిడిని తగ్గించాలని ఆదేశించారు. పీహెచ్సీలలో టీవీలు, సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూడాలని, రోగుల ఫోన్ నెంబర్లు విధిగా నమోదు చేసి వారికి ఆరోగ్య సమాచారం ఇవ్వాలని అన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మెడికల్ ఆఫీసర్లు శ్రవణ్ కుమార్, సౌమ్య పాల్గొన్నారు.



## శ్రీ స్వర్ణయుగ కల్కి భగవాన్ ఆలయంలో... ధన త్రయోదశి సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమం

కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: ధన త్రయోదశి సందర్భంగా ఈ రోజు శ్రీ స్వర్ణయుగ కల్కి భగవాన్ ఆలయంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది

ప్రతి మంగళవారం ఆరోగ్య పూజ మరియు అన్నప్రసాద కార్యక్రమాన్ని గడిచిన నాలుగు సంత్సరాలుగా నిర్వహించడం జరుగుతుందని,నేటి అన్నప్రసాదానికి దాతలుగా పార్శి మంజుల శ్రీనివాస్,వారి కుమారులు ప్రగత్,పృథ్వి లు ముందుకు రావడం జరిగిందని వారికి ఆలయ సేవకులు సన్మానం చేసి తీర్థ ప్రసాదాలను అందజేసి అభినందించడం జరిగింది. అన్నప్రసాద కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించాలనుకునే దాతలు ఏర్రం చంద్రశేఖర్ 9849601438 ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ పరంజ్యోతి భగవతి భగవాన్ ఆలయ సేవకులు ఎర్రం విజయ్ కుమార్,సిద్ధంశెట్టి శ్రీనివాస్, దిగంబర్, సంతోష్,వినోద్,స్వరూప చంద్రకళ ఆలయ న్యాయ సలహాదారులు డాక్టర్ బాలు పాల్గొనడం జరిగింది.

## గర్భిణీ మహిళకి రక్తదానం చేసిన శ్రీకాంత్ రెడ్డి

### రక్తం పొలంలో పండేది కాదు రక్తం తయారు చేసేది కాదు రక్తం మానవత్వంతో మరొక మనిషికి రక్తం పంచడమే రక్తదానం




కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: కామారెడ్డి జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీ మహిళకు అత్యవసరంగా ఆపరేషన్ నిమిత్తమై ఏబి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు జిల్లా రక్తదాతల సేవాసమితి సంప్రదించడంతో ఒక్క ఫోన్ చేయగానే స్పందించిన శ్రీకాంత్ రెడ్డి సహకారంతో వారికి కావలసిన ఏబీ పాజిటివ్ రక్తం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రక్తదాత మాట్లాడుతూ ఎవరికైనా రక్తం అవసరం ఉంది అనీ మెసేజ్ గాని ఫోన్ గాని రాగానే 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు రక్తదానంకు ముందుండాలని కోరారు. రక్తదాతకు జిల్లా రక్తదాతల సేవాసమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్ ముదాం శ్రీధర్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేషంట్ కుటుంబసభ్యులు మరియు బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిల్డింగ్ పెయింటింగ్ సంఘాల జేఏసీ చైర్మన్ గా చాడ ఆనంద్

కరీంనగర్, డిసెంబర్ 31 ( వాయిస్ టుడే): ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిల్డింగ్ పెయింటింగ్ సంఘాల జేఏసీ చైర్మన్ గా చాడ ఆనంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిల్డింగ్ పెయింటింగ్ సంఘాల (జె ఎ సి) నూతన కార్యవర్గంను కరీంనగర్ సర్కస్ గ్రౌండ్ లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రస్తుత జగిత్యాల జిల్లా, సిరిసిల్ల జిల్లా, పెద్దపల్లి జిల్లా, కరీంనగర్ జిల్లాతో పాటు హుస్నాబాద్ జోన్ ల నుండి సమావేశానికి హాజరైన బిల్డింగ్ పెయింటర్ల ఆమోదంతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటయింది. జేఏసీ చైర్మన్ గా చాడ ఆనంద్, అధ్యక్షులుగా అంబాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా బషీరోద్దీన్ (యూసుఫ్), కోశాధికారిగా గౌస్(బబ్లూ), గౌరవ సలహాదారులుగా నాతరి ప్రకాష్, ఎండి మొబిన్ ,ముల్కల భాస్కర్, ముఖ్యసలహాదారులుగా దొమ్మటి రామకృష్ణ , చిలుకల అంజన్న, ఎస్.కె మౌలానా, బొల్లం మల్లేశం, సిరిసిల్ల జిల్లా ఇంచార్జి, బండి శివ, జగిత్యాల జిల్లా ఇంచార్జి పూదరి మల్లేశం, పెద్దపల్లి జిల్లా ఇంచార్జి అప్సత్, కరీంనగర్ జిల్లా ఇంచార్జి దుర్గం స్వామి, మానకొండూర్ నియోజక వర్గం ఇంచార్జి గన్నారం రమేష్, పంచాయతీ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, కిరణ్ తివారి, ఎండి సలీమ్, ఉపాధ్యక్షులుగా సుంకపాక గంగయ్య, గడిపె తిరుపతి రాసూరి శేఖర్, ఎండి హైమత్ ఫాషా, ఉప కోశాధికారి సాభీర్, సహాయ కార్యదర్శులు కందూరి సత్యలింగం తదితరులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బిల్డింగ్ పెయింటింగ్ సంఘాల జేఏసీ నూతన కమిటి బాధ్యులుగా ఎన్నికయ్యారు.

## కరీంనగర్ పట్టణంలో విస్తృతంగా సర్దార్ రవీందర్ సింగ్ ప్రచారం



కరీంనగర్, డిసెంబర్ 31 ( వాయిస్ టుడే): నగరంలోని పలు ప్రయివేట్ విద్యాసంస్థలలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రచారంలో మాజీ మేయర్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో ఉన్నటువంటి పట్టభద్రులు నన్ను దీవించి గెలిపించాలని కోరారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ కోసం వచ్చే నాయకుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని వారు అన్నారు. ఎందుకంటే ఈరోజు కొందరు కేవలం తమ వ్యాపారాల కోసమే ముందుకు వచ్చి ఎన్నికలలో పోటీ ముందుకు వస్తున్నారు కానీ నేను మాత్రం విద్యార్థి దశ నుండి పేద బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తున్నాను అని, కౌన్సిలర్గా, కార్పోరేటర్ గా, మేయర్ ఎప్పుడూ అవకాశం వచ్చిన ప్రజలకు దగ్గర ఉండి వారికి కావల్సిన మౌలిక వసతుల కల్పన కోసం పని చేశానని అన్నారు. కరీంనగర్ ప్రజల కోసం రూపాయి పథకాలు రూపొందించడం జరిగిందని అన్నారు. ఇప్పుడు నన్ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నాలుగు జిల్లాలో ఉన్న పట్టభద్రులకు కేవలం ఒక్క రూపాయికే హెల్త్ ఇన్సూరెన్స్ పథకం తీసుకువస్తాననీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యోగ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, శాతవాహన యునివర్సిటీ జెఏసి చైర్మన్ చైతన్య పాల్గొన్నారు.

# చండీగఢ్ విద్యుత్ కార్మికులపై ఎస్మాని ఎత్తివేయాలి

## కార్మికుల నిరసన



భద్రాచలం, డిసెంబర్ 31 (వాయిస్ టు డే ). కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ చట్ట సవరణ బిల్లును రద్దు చేయాలని, విద్యుత్ రంగ ప్రవేటీకరణ ఆపాలని, చండీగఢ్ విద్యుత్ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఎస్మా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం భద్రాచలం విద్యుత్ శాఖ డివిజన్ ఇంజనీర్ కార్యాలయం ముందు భోజనం విరామ సమయంలో ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొలగానీ రమేష్, గడ్డం స్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ చట్ట సవరణ బిల్లురద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యుత్ చట్ట సవరణ బిల్లు వల్ల ఉచితంగా వస్తున్న జీరో కరెంటు బిల్లు, రైతులకు ఉచిత కరెంటు అన్నీ కూడా రద్దు అయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఈ ప్రైవేటీకరణ కు వ్యతిరేకం గా కార్మికులు, కర్షకులు , వినియోగదారు లు కలిసి పోరాటం చేయాలని కోరారు.

సి ఐ టి యు పిలుపుమేరకు దేశవ్యాప్తంగా విద్యుత్ కార్మికుల పోరాట సంఘీబావ దినం పాటించారు. భద్రాచలం పట్టణంలో బిల్డింగ్ రంగ కార్మికులు, ముఠా కార్మికులు , జిసిసి హమాలి కార్మికులు, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడుతూ 2022లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కేంద్ర విద్యుత్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. చండీగఢ్ లో ని విద్యుత్ రంగం 200 కోట్ల రూపాయల లాభాల్లో నడుస్తుంటే ఆ సంస్థను కేవలం 173 కోట్ల రూపాయలకే ఆదానీ కంపెనీకి మోదీ ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. దానికి వ్యతిరేకంగా ఆ రాష్ట్రంలో మొత్తం విద్యుత్తు కార్మికులు ఇంజనీర్లు ఉద్యోగులు సమ్మెకు దిగి పోరాటం చేస్తున్న క్రమం వారిపై ఎస్మా ప్రయోగించిందని ఇది సరైనద కాదని అన్నారు. తక్షణమే చండీగఢ్ విద్యుత్ కార్మికులపై ప్రయోగించిన ఎస్మా ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. చండీగఢ్ విద్యుత్తు కార్మికుల పోరాటానికి దేశవ్యాప్తంగా కార్మికులు సంఘీభావం గా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే అన్ని రంగాల కార్మికులు నల్ల బ్యాడ్జీల ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గడ్డం స్వామి, నకిరికంటి నాగరాజు, అజయ్ కుమార్, రాయల రాములు, కొలగాని రమేష్ , డివిజన్ కార్యదర్శి పదిలం శ్రీనివాస్, గడ్డం స్వామి, 1104 యూనియన్ నాయకులు రాజ్ కుమార్, 327 డివిజన్ అధ్యక్షులు జి. సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



## మున్సిపల్ సామాగ్రి అపహరణ కమిషనర్‌కు ఫిర్యాదు

కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: గత 11 రోజుల క్రితం కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించిన లక్షల రూపాయల విలువ గల రాగి, ఇనుప బోరు మోటర్ వస్తువులు,విద్యుత్ మీటర్లు ఇతర మున్సిపల్ సామాగ్రి మరియు వస్తువులను కొంత మంది అక్రమంగా అమ్ముకున్నారని మున్సిపల్ కమిషనర్ కు గతంలో కౌన్సిలర్లు నిట్టు కృష్ణ మోహన్ రావు ముప్పారపు అపర్ణ ఆనంద్,ముదాం ప్రముఖ నవీన్ లు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు చేసి 11 రోజులు అవుతున్న చర్యలుఎందుకు తీసుకోవడం లేదని ఈరోజు కమిషనర్ ను నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు కౌన్సిలర్లు నిట్టు కృష్ణ మోహన్ రావు ముప్పారపు అపర్ణ ఆనంద్,ముదాం ప్రముఖ నవీన్ కలిసి నిలదీశారు. ఇప్పటి వరకు పోలీస్ ఫిర్యాదు ఎందుకు చేయలేదని కౌన్సిలర్లు మున్సిపల్ కమీషనర్ ను ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ తాను ఇక్కడకు వచ్చి ఐదు రోజులు అవుతుందని ఈ విషయంపై కలెక్టర్ ను కలిసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు వేణుగోపాల్ రావ్ మాట్లాడుతూ మున్సిపల్ కు సంబంధించిన లక్షల విలువైన సామాగ్రిని కొంత మంది ఇంటి దొంగలే అమ్ముకున్నారని, ఆ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆ విషయంపై కమిషనర్ ను మరొకసారి కలిసినట్టు తెలిపారు. ఈ విషయంపై అమ్ముకున్న దొంగలపై చర్యలు తీసుకునేవరకు ఊరుకోమని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని అన్నారు.




## చేవెళ్ల మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

చేవెళ్ల...డిసెంబర్ 31(వాయిస్ టుడే) చేవెళ్ల మండల కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండాను ఎగురవేసిన జిల్లా కార్యదర్శి శంకర్. దేశంలో విద్యార్థుల సమస్యల కోసం అలు పెరగని పొరటం చేస్తు, అగ్రగాని విద్యార్థి సంఘంగా, విద్యార్థుల పోరాటాల వేగుచుక్కగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ అరుణ్ కుమార్ ,చేవెళ్ల మండల అధ్యక్షులు సమీర్, కార్యదర్శి చందు, మొయినాబాద్ మండలం అధ్యక్షుడు చరణ్ గౌడ్, కార్యదర్శి తేజ ఎస్ ఎఫ్ ఐ నాయకులు పి. నవీన్, పి. శివ, సందీప్, సాయి చరణ్, సిద్దు, ప్రవీణ్,సంతోష్, సౌమ్య, శ్రావణి, మమత, అమూల్య, గాయత్రి, సంధ్య, లావణ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: రాజంపేట మండలం ఆరేపల్లికి చెందిన కొమ్ము నర్సింలు (37) అప్పుల బాధ భరించలేక సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రాజంపేట మండల యువజన అధ్యక్షుడు అంకం కృష్ణారావు బాధిత కుటుంబానికి రూ. 2వేల ఆర్థిక సాయం అందించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు బిక్కాజి దిలీప్, కొమ్ము యాదగిరి, పెర్క సతీష్, కైరం కొండ సిద్ధరాములు, చిన్న రాములు ఉన్నారు.

## కామారెడ్డిలో గంజాయిపై ఉక్కుపాదం



కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: కామారెడ్డి జిల్లాలో 2024లో గంజాయి సాగు, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలో గంజాయి సాగు, రవాణా, అమ్మకాలు అరికట్టడంలో భాగంగా 31 కేసులు నమోదు చేశారు. సుమారు రూ. 15.18.705 విలువ చేసే10.8 కిలోల నిషేధిత ఎండు గంజాయిని రూ. 2 లక్షల విలువ చేసే గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా పోలీస్ శాఖ పేర్కొంది.

## రేపటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ



కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: రేపటి నుంచి రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు బిక్కనూర్ తహశీల్దార్ శివప్రసాద్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు సకాలంలో ఉచిత బియ్యం అందించాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.



## ఒంటికాలిపై ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: సమగ్ర శిక్షా ఉద్యోగులు రోజుకో రీతిలో తమ నిరసన తెలుపుతున్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. 22వ రోజు నిరసనకు తపస్ ఉపాధ్యాయ సంఘం, బీవీఎం విద్యార్థి సంఘ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు శ్రీధర్ రాములు, కాళిదాసు, శైలజ, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.



## హమాలీల సమ్మెకి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

### సిఐ టి యు జిల్లా కార్యదర్శి ఎ జె రమేష్

భద్రాచలం, డిసెంబర్ 31 (వాయిస్ టుడే): జీసిసి,సివిల్ సప్లై హమాలీలె వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 1 నుండి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు జీసిసి జిల్లా మేనేజర్ సమ్మయ్య, భద్రాచలం మేనేజర్ జయరాజ్ కి జీసిసి హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ, సిఐ టి యు ఆద్వర్యం లో భద్రాచలం లో సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జె.రమేష్ మాట్లాడుతూ 2024 జనవరి 1 నుండి కొత్త రేట్లు అమలులో రావాల్సినదానికి జరగాల్సిన ఒప్పందం చాలా ఆలస్యంగా పది నెలల తర్వాత గత అక్టోబర్ నెల లో జరిగిందని అన్నారు.సివిల్ సప్లై, జీసీసి ఉన్నతాధికారుల సమక్షం లో రేట్ల ఒప్పందం, బోనస్ ఒప్పందం,స్వీట్ బాక్స్ ల ఒప్పందం,క్లాత్ స్తిచ్చింగ్ ఒప్పందం యూనియన్ నాయకత్వానికి,ఉన్నతాధికారులకు చర్చలు జరిగి ఒప్పందాలు జరిగాయని,ఈ ఒప్పందాల అమలులో గత 10 నెలల కాలంగా రావాల్సిన వాటన్నింటినీ ఏరియర్స్ రూపం లో ఇస్తామని కూడా అంగీకరించారని అన్నారు. స్వయాన ప్రభుత్వమే చేసిన ఒప్పందాన్ని ప్రభుత్వమే ఉల్లంగించడం ఏమిటని ప్రశ్నించారు.ఈ ఒప్పందం అమలు కోసం గత మూడు నెలలుగా ప్రభుత్వానికి రాయబారాలు చేసినా,దశల వారీగా ఆందోళనలు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు.ఈ నేపథ్యం లో అనివార్య మై పరిస్థితుల్లో నిరవధిక సమ్మె లోకి కొత్త సంవత్సరం జనవరి మొదటి తేది నుండే వెళు _న్నామని,సమ్మె కి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. హమాలీ కార్మికుల సమ్మె కి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో జీసిసి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సుబ్రమణ్యం, సీఐటీయూ నాయకులు గడ్డం స్వామి, హమాలీ యూనియన్ నాయకులు ప్రసాద్, ఉప్పలయ్య, శ్రీను ఉన్నారు.

## నెహ్రూ కప్‌లో ఆర్ సి సి, సూపర్ స్ట్రైకర్స్, గని లెవెన్ జట్ల విజయం



భద్రాచలం, డిసెంబర్ 31 (వాయిస్ టుడే): భద్రాచలం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న తాళ్లూరి భారతీదేవి స్మారక 29 వ నెహ్రూ కప్ క్రికెట్ పోటీలలో మంగళవారం ఉదయం బి ఎఫ్ సి భద్రాచలం, ఆర్ సి సి పాల్వంచ జట్ల మధ్య జరిగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన బిఎస్సి జట్టు 14 ఓవర్లలో 9 కోల్పోయి 92 పరుగులు చేసింది. 93 పరుగులు విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆర్ సి సి పాల్వంచ జట్టు 93 పరుగులు చేసి విజయం సాధించారు. ఈ జట్టులోని వెంకీ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్లో సూపర్ స్ట్రైకర్స్ జట్టు భీమడోలు జట్టుపై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన సూపర్ స్ట్రైకర్స్ జట్టు 14 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 136 పరుగులు సాధించారు. ఈ జట్టులోని సాయిచంద్ 46 బంతుల్లో 70 పరుగులు, భరత్ 31 పరుగులు సాధించారు. భీమడోలు జట్టు 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసి పరాజయం పాలయ్యారు.

సాయంత్రం జరిగిన మూడో మ్యాచ్లో గని లెవెన్ హైదరాబాద్ జట్టు, చింతూరు లెవెన్ జట్ల మధ్య జరిగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గని లెవెన్ జట్టు 14 ఓవర్లలో 149 పరుగులు చేశారు. ఈ జట్టులోని జి.ఎస్.కె 37, శ్రీనాథ్ 36 పరుగులు సాధించారు.150 పరుగుల విజయలక్ష్యం తో బ్యాటింగ్ ప్రారంభించిన చింతూరు జట్టు కేవలం 109 పరుగులు చేసి ఓటమి పాలయ్యారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికైన సాయి కృష్ణారెడ్డికి డాక్టర్ పాల్ రాజ్ ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ శ్రీమతి వరలక్ష్మి, సాయిరాం, వి. రాజశేఖర్, హర్షిణి, వి చంద్రశేఖర్, డాక్టర్ వాసవి లు ట్రోఫీ ని అందించారు. ఈ కార్యక్రమం లో నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి, అధ్యక్షులు అట్లూరి శ్రీధర్, కార్యదర్శి దాట్ల శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షులు గుమ్ములూరి శ్రీనివాస్, సెక్రటరీ సలీం, కోశాధికారి కుంచాల సదానందం, కమిటీ సభ్యులు పూనెం ప్రదీప్ కుమార్, ఉదయ్ పాల్గొన్నారు.

## కులాల పేరుతో వివక్షకు పాల్పడితే చర్యలు



కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 31: కులాల పేరు చెప్పి వివక్షకు పాల్పడితే కఠిన చర్య లు తప్పవని ఏఎస్ఐ జగదీష్ అన్నారు. బిక్కనూరు మండలం జంగంపల్లిలో సివిల్ రైట్స్ డే సందర్భంగా మంగళవారం గ్రామ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థులు ఐక్యమత్యంతో కలిసిమెలిసి జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది బాలయ్య, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పుల్లూరి శివలింగం, గ్రామస్థులు పాల్గొన్నారు.



## కివి పాఠశాలలో అలరించిన ఫుడ్ ఫెస్టివల్

వరంగల్ ( వాయిస్ టుడే ) డిసెంబర్ 31: అండర్ రైల్వే గేట్ కరీమాబాద్ లో గల కివి పబ్లిక్ స్కూల్ లో మంగళవారం నాడు అందరిని ఆహ్లాద పరిచేలా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు తమ ఇంటి వద్ద తయారు చేసినటువంటి వివిధ వంటకాలను తీసుకువచ్చి వాటిని ప్రదర్శించి క్రయవిక్రయాలు కూడా చేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి మాట్లాడుతూ చిన్ననాటి నుండే పిల్లలలో సృజనాత్మకత పెంపొందే విధంగా చదువుతోపాటు వివిధ అంశాలలో కూడా పిల్లలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఈ యొక్క ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం జరిగిందని, మరియు విద్యార్థిని విద్యార్థులు తమ తోటి వారితో ఎలా మెలగాలి మరియు వారు తమకు సంబంధించినటువంటి వ్యాపారాన్ని ఎలా నిర్వహించాలో అలాగే విద్యార్థుల లోపల దాగి ఉన్న ఆత్మవిశ్వాసాన్ని ఇలాంటి ఫుడ్ ఫెస్టివల్స్ పెంపొందిస్తాయని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్ పాఠశాల డైరెక్టర్ దాసి రజని మరియు అధ్యాపక బృందం రవితేజ, రంజిత ఇతరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానికులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావడం జరిగింది. విద్యార్థులు తయారు చేసినటువంటి 203 వంటకాలను అందరూ రుచిచేసి విద్యార్థులకు అభినందనలు తెలిపారు



# దౌర్జన్యం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

ఖమ్మం, డిసెంబర్ 31( వాయిస్ టుడే ): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కే రాములు అయ్యప్ప మాల వేసుకున్న ఎనిమిదో తరగతి విద్యార్థికి కాలు తాకిందనే నెపంతో విధి నిర్వహణలో ఉన్న దళిత హెడ్మాస్టర్ రాములును 50 మంది మతోన్మాద ముసుగులో కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన దుండగుల పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నందిపాటి మనోహర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, అంబెడ్కర్ ప్రజా సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షులు లింగాల రవికుమార్ లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం స్థానిక జడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత ప్రధానోపాధ్యాయుడుపై దాడిని ఖండిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 21న పాఠశాల ఆవరణలో విద్యార్థులందరినీ కూర్చోబెట్టి పాఠ్యాంశం బోధిస్తున్న సందర్భంలో అక్కడికి ఇక్కడికి తిరగటం వల్ల 8వ తరగతి చదువుతున్న అరుణ్ అనే విద్యార్థి అయ్యప్ప మాల వేసుకుని కూర్చున్నాడు అతనికి చూడక కాలు తాకడంతో కుటుంబ సభ్యులు మిగతా అయ్యప్ప స్వామి మాల వేసుకున్న వారికి విద్యార్థి సమాచారం

అందించడంతో డిసెంబర్ 23న పాఠశాలపైకి ఒకేసారి అయ్యప్ప మాలలు వేసుకున్న వారు మరి కొంత మంది సివిల్ డ్రెస్ లో ఉన్నటువంటి మొత్తం 50 మంది జైశ్రీరామ్, జైఅయ్యప్ప అనుకుంటూ ప్రదానోపాధ్యాయుడుపై దౌర్జన్యానికి పాల్పడ్డారని, పాఠశాల ఉపాధ్యాయులు ఎంత మేరకు నచ్చ చెప్పిన వినకుండా సభ్య సమాజం తలదించుకునేలా ప్రధాన ఉపాధ్యాయుడుచే విద్యార్థి కాళ్లు మొక్కించారు ఇది మతోన్మాదులు మనువాదులు చేసిన దుశ్చర్య అని వారు విమర్శించారు. ఆచార్యదేవోభవ అని కొలిచే వారికి ఉన్మాదం తలకెక్కిందన్నారు. తండ్రి, కొడుకు కాళ్లు మొక్కడం ఎక్కడైనా చూసామా అని వారు ప్రశ్నించారు? కాళ్లు మొక్కించే టైంలో కులం పేరుతో దూషించడమే కాకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దానిని వెనక్కి తీసుకోవాలని హెచ్ఎం ను మానసిక ఒత్తిడి చేసి భయభ్రాంతులకు గురి చేయడం హేయనీయమన్నారు. విధి నిర్వహణలో ఉన్న దళిత ప్రధానోపాధ్యాయుడిపై ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై వీడియో ఫుటేజ్ ఆధారంగా తక్షణమే వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లు తక్షణమే జోక్యం చేసుకొని వారిపై చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆధునిక సమాజంలో ఇలాంటి ఆటవిక చర్యలను ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, పౌర సమాజం ఖండించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ, మాచర్ల గోపాల్, సి హెచ్ వీరభద్రం, జె. కిరణ్, గుమ్మడి భిక్షం, గౌర్రిముచ్చు శాంతయ్య, మండల జగదీశ్, వ్య కా స నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వరరావు, పడిగేల నాగేశ్వరరావు, కెజికేఎస్ జిల్లా అధ్యక్షులు బోడపట్ల సుదర్శన్ ఏ ఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## క్రీడా రంగానికి హనుమకొండ కేంద్రంగా నిలుస్తుంది



**మౌళిక వసతులు, అభివృద్ధి కోసం కృషి చేస్తా**

**జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలి**

**రెజ్లర్, వ్రేస్థలింగ్ క్రీడలను ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నాయిని**

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: క్రీడా రంగంలో హనుమకొండ అన్ని విధాలుగా సౌకర్యాలు ఉన్నాయని, క్రీడా కేంద్రంగా హనుమకొండ అభివృద్ధి చెందుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జెఎన్ఎస్ స్టేడియంలో జరుగుతున్న అథ్లెటిక్స్ టోర్నమెంట్ ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. స్టేడియంలో జరుగుతున్న బాలిక, బాలుర 1500మీటర్ల పరుగుల పందెం, లాంగ్ జంప్ క్రీడాలను జెండా ఊపి ప్రారంభించారు. క్రీడా రంగం అభివృద్ధి కొరకు స్థానిక శాసనసభ్యుడిగా అన్ని సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. క్రీడాల పోటిల్లో ఉత్తమ ప్రతిభ చూపాలని జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రాఖ్యతలు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ అజిజ్ ఖాన్, తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ చైర్మన్ జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్ రావు, జిల్లా క్రీడాశాఖ అధికారి అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, నాయిని లక్ష్మా రెడ్డి, స్థానిక నాయకులు, క్రీడా కారులు, కోచ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ ఆత్మీయ సభలో పాల్గొన్న మాజీ కూడా చైర్మన్



హనుమకొండ, వాయిస్ టుడే: ఎంపీడీవో (ఈటిసి) హసన్ పర్తి లో జూనియర్ ఫాకల్టీలో పని చేస్తున్న వి. సాయి చరణ్ పదవి విరమణ పొందగా కుడా మాజీ ఛైర్మెన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హసన్ పర్తి డిఆర్డిఏ లో మంగళవారం ఏర్పాటుచేసిన పదవి విరమణ ఆత్మీయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కూడా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా పంచాయతీరాజ్ శాఖలో వివిధ హొదాల్లో పనిచేశారన్నారు. సాయి చరణ్ ఏ మండలంలో పనిచేసిన మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఉద్యోగ కాలంలో ఎలాంటి మచ్చలేకుండా పనిచేసిన వ్యక్తి సాయి చరణ్ అని తెలిపారు. ఉద్యోగులకు ఎన్ని రోజులు పనిచేసిన పదవి విరమణ తప్పదని తెలిపారు.



## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ ఆఫీసర్‌ను సన్మానించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం, డిసెంబర్ 31 ( వాయిస్ టుడే ) ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై గా భాధ్యతలు నిర్వహిస్తూ, ఉద్యోగ విరమణ పొందిన %ాఖ%. గౌస్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ శాఖ మన్ననలు పొందారని పోలీస్ కమిషనర్ కొనియాడారు. మీ విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నరేష్ కుమార్, ఆర్ ఐ కామరాజు, సురేష్, పోలీస్ అసోసియేషన్ జానీమియా పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు కై ఉధృతంగా ప్రజా పోరాటాలు

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్**

ఖమ్మం, డిసెంబర్ 31 ( వాయిస్ టుడే ): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీలు అమలు చేయకపోతే 2025 సంవత్సరం అంతా ప్రజలను సమీకరించి ఉధృతంగా ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హవేలీ మండల కమిటీ సమావేశంలో శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఆరు గ్యారెంటీల పేరుతో అనేక వాగ్దానాలు చేసి ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప మిగతావన్నీ పాక్షికంగా అమలు జరిపి మేం మొదటి సంవత్సరంలోనే అన్ని హామీలు అమలు చేశామని గొప్పలు చెప్పడం కోసం సభలు జరపడం సిగ్గుచేటని ఆయన ఎద్దేవా చేశారు. ప్రధానంగా ఖమ్మం నగరంలో అనేక సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని నగర పాలన నత్తనడకన సాగుతోందని శ్రీకాంత్ ఆరోపించారు. ఖమ్మం నగరంలో వేలాదిమంది ఇళ్ల స్థలాలు లేక సొంత ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప పథకాల అమలు కావడం లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులను గుర్తించి వారికి వెంటనే ఇళ్ల స్థలాలు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే అధికారులు చూచి చూడనట్లు వ్యవహరించడం సరైన కాదని ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, కబ్జాదారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడకపోతే భవిష్యత్తులో ప్రజలను సమీకరించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

## కొత్త ఉత్సాహం కొనసాగాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



ఖమ్మం , డిసెంబర్ 31 ( వాయిస్ టుడే ) కొత్త ఏడాది... కొత్త ఆశలు.... కొత్త కోరికలు.... కొత్త లక్ష్యాలు.... కొత్త ఆశయాలు.... కొత్త నిర్ణయాలు.... కొత్త ఉత్సాహంతో కలకాలం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు 2025 నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. ఇంటింటా ఆనందాలు.... ప్రతీ కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ



ఖమ్మం, డిసెంబర్ 31 ( వాయిస్ టుడే ): స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులను ప్రోత్సహించడానికి మరియు వారిలో ఉన్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికితీయడానికి నాసా కాంటెస్ట్లో పాల్గొన్న విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ నర్సింగ్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ డిస్టిక్ కన్వీనర్ (అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్) మరియు ఏజీఎం రాంకీ గారు పిల్లలకు కిట్ల పంపిణీ చేశారు. ఈ నాసా కాంటెస్ట్ అంతరిక్షంలో ఎలా జీవించాలి అనే అంశంపై ఈ సంవత్సరం థీమ్ తో వినూత్న ప్రాజెక్టుపై పని చేయడానికి విద్యార్థులను ప్రోత్సహిస్తుంది. నారాయణ విద్యాసంస్థలు నిరంతరంగా ఈ నాసా కాంటెస్ట్ ను కొనసాగిస్తూ విజయాలను చవిచూస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను డాక్టర్ నర్సింగు శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రాంకీ తో పాటు ప్రిన్సిపాల్ రేఖ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరసింహారావు, నాసా స్కూల్ ఇంచార్జ్ అపర్ణ , విద్యార్థులు పాల్గొన్నారు.



## సాయివర్ధన్ ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ఖమ్మం. డిసెంబర్ 31 ( వాయిస్ టుడే ): గురుకుల విద్యాలయాల్లో గత కొంతకాలంగా ఆత్మహత్యల పరంపర కొనసాగుతూ ఉండటం వల్ల గురుకులాలపై అపోహలకు తావిస్తోందని తక్షణమే విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి లక్ష్మణ్ వి వెంకటేష్ లు ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. పి డి ఎస్ యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కిష్టాపురం ఎస్సీ గురుకులంలోలి

ఇంటర్ విద్యార్థి సాయివర్ధన్ ఆత్మహత్యపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరుతూ జిల్లా అడిషనల్ కలెక్టర్ పిన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తక్షణమే కిష్టాపురం సాంఘిక సంక్షేమ గురుకులంలో కలెక్టర్ విజిట్ చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్ చదువుతున్న సాయివర్ధన్ నిన్న ఇంటి నుంచి కళాశాలకు వచ్చిన ఆత్మహత్యకు పాల్పడడం పై అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. అధికారులు విద్యార్థి పై చెప్పున్నటువంటి ఆరోపణలు ఒకవైపు ఉంటే తల్లిదండ్రులు మరోవాదన చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో గురుకులాలలో విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు అనేకం జరుగుతున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు జరగడం శోచనీయం. తక్షణమే ఖమ్మం జిల్లా కలెక్టర్ సాయివర్ధన్ మృతి పై సమగ్రమైన విచారణ చేసి ఆ గురుకుల లో చదివే విద్యార్థులకు భరోసా కల్పించాలన్నారు. జిల్లా లో ఉన్న గురుకులను జిల్లా అధికారులు పరివేక్షణ లేకపోవడం వలనే నేడు గురుకుల లో ఫుడ్ పాయిజాన్, విద్యార్థులను ఎలుకలు కరవడం వంటి అనేక ఘటనలు జరుగుతున్నాయి అన్నారు. కావున తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ స్పందించి సాయి వర్ధన్ కుటుంబానికి న్యాయం చేసేటువంటి విధంగా చర్యలు చేపట్టాలని అలాగే గురుకుల పై జిల్లా అధికారులు పరివేక్షణ చేసేలా చెర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ల్ పిడిఎసు యూ జిల్లా నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, అశోక్, అనిల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగ కార్మికులు, ఇంజనీర్ల పోరాటానికి ఆర్టీసీ కార్మికుల సంఘీభావం



ఖమ్మం, డిసెంబర్ 31 ( వాయిస్ టుడే ): విద్యుత్తు రంగంలో ప్రైవేటీకరణ విధానాల్ని నిరసిస్తూ,విద్యుత్ రంగాన్ని పరిరక్షించాలని,విద్యుత్తు కార్మికులు ఇంజనీర్లు చేస్తున్న పోరాటం జయప్రదం కావాలని ఆకాంక్షిస్తూ వారి పోరాటానికి సంఘీభావంగా ఆర్టీసీ ఖమ్మం డిపో ఉద్యోగులు సంఘీభావం బ్యాడ్జీలు ధరించారు. మంగళవారం ఉదయం మొదటి షిఫ్ట నుండే ఆర్టీసీ ఉద్యోగులు సంఘ సంఘీభావ బ్యాడ్జిలు ధరించారు.స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్ డబ్ల్యు ఎఫ్ డిపో కమిటీ అధ్యక్షులు పగిళ్లపల్లి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం రీజియన్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు గుండు మాధవరావు, కార్యదర్శి పిట్టల సుధాకర్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాధవరావు,సుధాకర్ లు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్,చండీగఢ్ రాష్ట్రాలలో పోరాటం చేస్తున్న విద్యుత్ కార్మికుల పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడం కోసం ప్రత్యామ్నాయంగా పక్కనే ఉన్న పంజాబ్,హర్యానా,హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల నుండి కార్మికులను తెప్పించటానికి చేసిన ప్రయత్నం అక్కడి కార్మికులు నిరాకరించడంతో విఫలమైందన్నారు.ఉత్తరప్రదేశ్,చండీగఢ్ రాష్ట్రాల్లోని విద్యుత్ కార్మికుల పోరాటాన్ని అణచివేయాలని చూస్తే తామూ సమ్మెలోకి దిగుతామని హెచ్చరించిన విషయం కార్మికవర్గం గమనించాలన్నారు. పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ కార్మికులు పోరాడే కార్మికులకు అండగా నిలిచారని వారి స్ఫూర్తిని ప్రశంసిస్తూ జేజేలు పలికారు.తెలంగాణ ఆర్టీసీ లోనూ తోటి విద్యుత్ కార్మికుల పోరాటానికి సంఘీభావం ప్రకటించి మేముసైతం మీ పోరాటానికి అండగా ఉన్నామని చెప్పిన ఆర్టీసీ కార్మికులందరికీ అభినందనలు తెలియజేశారు.విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని,చండీఘడ్ విద్యుత్ కార్మికులపై ఎస్మాను ఎత్తివేయాలని, విద్యుత్తు జనరేషన్,ట్రాన్స్ మిషన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించవద్దని,విద్యుత్ చట్ట సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని, రైతు, కార్మిక, ఉద్యోగుల ఐక్య పోరాటాలు వర్ధిల్లాలని ఈ సందర్భంగా కార్మికులు నినదించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు గడ్డం వెంకటయ్య, సిరిపురపు సీతారామయ్య, బుడిగం శ్రీను, యండి గౌస్ పాషా, సీతమ్మ, స్వరూపరాణి, రమణకుమారి, కిరణ్, అయోధ్య, సత్యావతి, ధనలక్ష్మి, శైలజ, సుల్తానా, పద్మావతి, రాధ, మల్లికార్జున్, జ్యోతి, బాబు, యాదగిరి, మీసాల రవి, సత్యనారాయణ, యాకూబ్ బీ,లాజర్,వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలు హత్య ప్రయత్నం కేసును కొన్ని గంటల్లో ఛేదించిన వన్ టౌన్ పోలీసులు

పెద్దపల్లి జిల్లా: డిసెంబర్ .31 (వాయిస్ టుడే) గోదావరిఖని భార్యపై అనుమానంతో భార్య. మేనమామపై హత్యాయత్నం.. ఐదు గంటల్లో ఛేధించిన పోలీసులు

**నేరస్థుని వివరాలు:** గొల్ల శ్రావణ్, తండ్రి: నరేందర్, వయసు: 28సం?, కులము: మాల(ఎస్సీ), గ్రా. మం౹౹ం భీమారం, జిల్లా: మంచిర్యాల.

**నేరం జరిగిన ప్రదేశం:** గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం. నేరస్థుని దగ్గర నుంచి రికవరీ చేసిన ఉపయోగించిన కత్తి స్వాధీనం.

**నేరం చేసిన విధానం:**

మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన గొల్ల శ్రావణ్, తండ్రి: నరేందర్, వయసు: 28,సం కులము: మాల (ఎస్సీ) అను వ్యక్తి ఆరు సంవత్సరాల క్రితం పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖని వినోభానగర్ చెందిన కాళ్ల పూజతో ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గొల్ల శ్రావణ్ కు ఇతర మహిళతో వివాహేతర సంబంధం ఉన్నదని భార్యభర్తల మధ్య గత సంవత్సర కాలంగా గొడవలు జరుగుతున్నాయి. వీరి మేనమామ అయిన నంది శ్రీనివాస్, తండ్రి: రాజయ్య, 38సం వినోభానగర్, గోదావరిఖని అను వ్యక్తి తన మేనకోడలు అయిన పూజను ఎందుకు కొడుతున్నావని భీమారంకు వెళ్లి గొల్ల శ్రావణ్ మరియు అతని తల్లిదండ్రులతో మాట్లాడి మంచిగా చూసుకోవాలని సూచించాడు. గొల్ల శ్రావణ్కు తన పద్ధతి మార్చుకోవాలని సూచించాడు. అయినా తన ప్రవర్తన మార్చుకోకుండా వారం రోజుల క్రితం కూడా గొల్ల శ్రావణ్ పూజను కొట్టడంతో నంది శ్రీనివాస్, నంది నగేష్, కాళ్ల కిరణ్ లు భీమారంకు వెళ్లి పూజను గోదావరిఖనికి తీసుకువచ్చారు. దీనిపై పగ పెంచుకున్న గొల్ల శ్రావణ్ తన తల్లిదండ్రులు అయిన గొల్ల నరేందర్, గొల్ల పద్మ మరియు చిన్నమ్మలు అయిన వేద వరలక్ష్మి, పర్శ స్వప్న. అతని అమ్మమ్మ అయిన పర్శ బతుకమ్మ కుట్ర పన్ని, వారి ప్రోద్బలముతో ముందస్తు ప్రణాళిక



ప్రకారం తేది:31-12-2024 మంగళవారం రోజున ఉదయం 11.45గంటలకు గోదావరిఖనిలో వెంకటేశ్వర ఎలక్ట్రికల్ షాపులో పని చేస్తున్న నంది శ్రీనివాస్ వద్దకు వెళ్లి నీతో మాట్లాడేది ఉందని తన బైక్ ఎక్కించుకుని గోదావరిఖని బాలుర జూనియర్ కళాశాల మైదానంలోకి తీసుకువచ్చాడు. అప్పటికే గొల్ల శ్రావణ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో నంది శ్రీనివాస్ విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చాడు. దాడి చేసిన సమాచారం తెలిసిన వెంటనే గోదావరిఖని వన్టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని నంది శ్రీనివాస ను ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగింది. నంది శ్రీనివాస్ సోదరుడు నంది నగేష్ ఫిర్యాదు మేరకు నిందితుడు గొల్ల శ్రావణ్, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించడం జరిగింది. సీపీ శ్రీనివాస్, ఐజీ, పెద్దపల్లి డీసీపీ చేతన, ఐపీఎస్ ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుని కోసం గాలించగా నిందితుడు నేరం చేసి తప్పించుకుని తన ఇంటికి భీమారం వైపు వెళుతుండగా చాకచక్యంగా గోదావరిఖని వన్టౌన్ సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందాలు గోదావరిఖని గంగానగర్ బ్రిడ్జి వద్ద గొల్ల శ్రావణ్ పట్టుకుని అరెస్టు చేశాము పట్టుకున్న నిందితున్ని కోర్టులో హాజరు పరిచి రిమాండ్ తరలించడం జరిగింది. నిందితుడు తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం తన భార్యపైన తప్పుడు ఆరోపణతో అనుమానిస్తూ ఈ అఘాయిత్యానికి పాల్పడినాడు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ తరపున గట్టి పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది: నిందితునికి కఠినమైన శిక్షణ పడేలా చర్యలు తీసుకుంటామని గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో వినూత్న తీర్పు



రామకృష్ణాపూర్ డిసెంబర్ 31 (వాయిస్ టుడే): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కోర్టు వినూత్న తీర్పు ఇచ్చింది. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల పట్టణ ఎస్.ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 8 మంది పట్టుబడ్డారు. పట్టుబడిన వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా వారంతా 3 రోజులపాటు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి శుభ్రం చేయాలని మంచిర్యాల్ కోర్టు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఉపనిషేద్వానీ తీర్పునిచ్చింది.



## ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:తెలంగాణ రాష్ట్ర మరియు ఆలేరు నియోజకవర్గం ప్రజలందరికీ 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య.నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ..




## ఉద్యోగ భద్రత కోసం కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల దీక్షలు

భద్రాచలం, డిసెంబర్ 31 (వాయిస్ టు డే). ఉద్యోగ భద్రత కోసం కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు చేస్తున్న నిరవధిక దీక్షలు మంగళవారం నాటికి ఎనిమిదో రోజుకి చేరాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా లోని గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల ల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు పలు డిమాండ్ల తో భద్రాచలం ఐటిడిఎ ఎదుట నిరవధిక దీక్ష లు చేస్తున్నారు. నిరవధిక సమ్మె కు లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ లను ఆమోదించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మినిమం టైం స్కేట్ తో పాటు ఉద్యోగ భద్రతను కల్పించాలని, సి.ఆర్.టి ల సర్వీసులను క్రమబద్ధీకరించాలనీ, ప్రతి నెల 1వ తేదీన గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, మహిళా ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. .సి.ఆర్.టి ఆకు పి.ఎఫ్ సౌకర్యాన్ని కల్పించాలని 61 సంవత్సరాలు నిండిన వారికి 20 లక్షల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ను అందించాలని కోరారు. సి.ఆర్.టి లు అందరికీ హెల్త్ కార్డ్ సౌకర్యం అందించాలని, మహిళా సి.ఆర్.టీ పిల్లల సంరక్షణ కోసం వేతనం తో కూడిన చైల్డ్ కేర్ లీవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబాడి స్టూడెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు మోహన్ నాయక్, భాస్కర్ పవార్, కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గుగులోతు రవి నాయక్, మంగిలాల్ నాయక్, కోటి, బాబురావు బుచ్చయ్య దొర మహిళా సి ఆర్ టి లు కమల, ధనలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లాలో సిబ్బంది సమిష్టి కృషితో నేరాలు అదుపు


### జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ వెల్లడి

### నేరాలు అదుపులో

### సిబ్బంది కృషికి ఎస్పీ అభినందనలు

ఏలూరు, డిసెంబర్ 31 (వాయిస్ టుడే ప్రతినిధి) ఏలూరు జిల్లా లో పోలీస్ యంత్రాంగం సమిష్టి కృషితో 20 24 సంవత్సరంలో నేరాలను అదుపు చేసినట్లు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ పేర్కొన్నారు.

ఎస్పీగా కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ పదవీ బాధ్యతలు స్వీకరించిన దగ్గర నుంచి నేర నియంత్రణ కోసం అదేవిధంగా గంజాయి, నాటు సారాయి అలాగే ఇతర రాష్ట్రాల నుండి మద్యం మరియు ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన చెక్పోస్టులను అంతర్ జిల్లా అంతర రాష్ట్రాల వద్ద ఏర్పాటు చేశారు. చెక్పోస్టుల వద్ద 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. జిల్లాలో 2024 సంవత్సరం లో 38 మర్డర్ కేసులు నమోదు కాగా 2023 సంవత్సరములో 35 కేసులను నమోదు అయ్యాయి. ఈ ఏడాది అన్ని హత్య కేసుల్లో నిందితులను అరెస్టు చేశారు. ఈ ఏడాది కల్పబుల్ హోమిసైడ్ ఒక కేసు నమోదు కాగా 2023 సంవత్సరములో 8 కేసులు నమోదు అయ్యాయి. అదేవిధంగా డెకాయిటీ కేసు ఒకటి నమోదు కాగా గత ఏడాది మూడు కేసులు నమోదయ్యాయి. రోబరీలు 8 కేసులు నమోదు కాగా ఆయా కేసులలో నిందితులను అరెస్టు చేశారు.ఇంటి దొంగతనాలు ఈ ఏడాది 242 కేసులు నమోదు కాగా, 2023 లో 198 కేసులు నమోదు అయ్యాయి. ఈ ఏడాది జరిగిన అన్ని కేసుల్లో నిందితులను



అరెస్ట్ చేసి ఆస్తి రికవరీ చేశారు.సాధారణ దొంగతనం కేసులు ఈ ఏడాది 650 నమోదు కాగా గత ఏడాది 524 కేసులు నమోదు అయ్యాయి. ఆస్థి సంబంధమైన 611 కేసులలో 6 కోట్ల 44 లక్షల 57 వేల 479 రూపాయల ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఈ ఏడాది వివిధ కేసుల్లో 8.5 కేజీల బంగారం, 63 కేజీల వెండి, 360 ద్విచక్ర వాహనాలు 4 ఇతర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక రహదారి ప్రమాదాల విషయానికి వస్తే 2024 లో 590 కేసులు నమోదు కాగా 2023 లో 644 కేసులు నమోదు అయ్యాయి. ఈ ఏడాది అక్రమ మద్యం మరియు నాటు సారా తయారీ దారులపై 1106 కేసులను నమోదు చేశారు. ఆయా కేసుల్లో 1438 మందిని అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి 4007 లీటర్ల ఐ.ఎం.ఎఫ్.ఎల్. మద్యం, 5565 లీటర్ల నాటు సారాయి స్వాధీనం చేసుకుని 32740 లీటర్ల బెల్లం ఊట ను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా 61 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ గంజాయి రవాణా చేస్తున్న వారిపై 10 కేసులు నమోదు చేసి 36 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 4,81,660 రూపాయల విలువగల 90 కేజీల గంజాయిని, ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

పేకాట ఆడుతున్న 866 కేసులు నమోదు చేసి 4,027 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి 82,23,322 రూపాయలు, 343 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కోడి పందాల కేసులు 567 నమోదు చేశారు. ఈ సందర్భంగా 2,004 మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17,78,978 రూపాయలు, 770 కోడిపుంజులు, 1,022 కోడి కత్తులు, 293 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్ మరియు ఇళ్ళల్లో , అలాగే బయట ప్రాంతాల్లో జూదాలు నిర్వహిస్తున్న 237 మందిని అరెస్టు చేసి 26 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 16,28,720 రూపాయలు, 5 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది 1735 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి 44,60,300 రూపాయలు అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ ఏడాది లోకదాలతో 4849 కేసులలో రాజీ చేశారు. సైబర్ క్రైమ్ 95 కేసులు నమోదు కాగా, కేసులలో 1,15,06,651 రూపాయలు హోల్డ్ చెయ్యగా, 20,05,000 రూపాయలను భాదితులకి అందజేశారు. జిల్లాలో 1,01,51,500 రూపాయలు విలువైన778 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. జిల్లాలో జరిగిన వివిధ నేరాలకు సంబంధించి నిందితులను అరెస్టు చేసి, ఆస్తులను రికవరీ చేయడంలో సిబ్బంది కృషి ఎంతో ఉందని జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ పేర్కొన్నారు. ఇంత ప్రగతి సాధించడానికి కృషి చేసిన సిబ్బంది కి ఈ సందర్భంగా ఎస్పీ అభినందనలు తెలిపారు.



## కొమురయ్యకు ఉద్యోగ విరమణ సన్మానోత్సవం

హనుమకొండ, వాయిస్ టుడే: ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఖిలా వరంగల్ లోని మిడిల్ ఫోర్ట్ సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ ఈ. కొమురయ్యను ఉర్సు కాంప్లెక్స్, వరంగల్, ఖిలా వరంగల్ మండలాల సోషల్ ఉపాధ్యాయుల సోషల్ ఫోరం కమిటీ ఘనంగా సన్మానించింది. ఆ పాఠశాలలో కొమురయ్య ఉద్యోగ విరమణ సన్మానోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎస్ ఉర్సు కాంప్లెక్స్ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు పూసారం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్ ప్రధానోపాధ్యాయులు జి. ప్రభాకర్, సోషల్ ఫోరం కమిటీ గౌరవాధ్యక్షులు ఏం.భూపాల్ రెడ్డి, అధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం. బిక్షపతి, సెక్రటరీ కె. శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజర్ సంపత్, సభ్యులు శోభారాణి, వెంకట్ రెడ్డి, గులాబ్ సింగ్, సమ్మయ్య, గౌతం, ప్రభాకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల సుభిక్షమే ప్రజాప్రభుత్వ సంకల్పం

### అభివృద్ధి, సంక్షేమం కొత్త సంవత్సరంలో మరింత వేగవంతం

### హనుమకొండ జిల్లా ప్రజలకు నాయిని నూతన సంవత్సర శుభాకాంక్షలు



హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: యావత్ తెలంగాణా సమాజం సుభిక్షంగా ఉండాలి అన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంకల్పమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా అందుకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసి విజయవంతం అయ్యిందని ఆయన కొనియాడారు. మరికొద్ది గంటల్లో నూతన సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా హనుమకొండ జిల్లా ప్రజలకు ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు పరిచిన చరిత్ర ప్రజా ప్రభుత్వందని ఆయన తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రజల ఆకాంక్షలకు తగిన ప్రణాళికలు రూపొందించి సుభిక్షమైన పాలనను అందించి కొత్త వరవడిని సృష్టించి న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కిందన్నారు. అదే వరవడి తో నూతన సంవత్సరంలోనూ సంక్షేమం,అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. అదే సమయంలో ప్రజలు నూతన సంవత్సరంలో తీసుకోబోయే నిర్ణయాలు వారి వారి అభ్యున్నతికి దోహదపడలని ఆకాంక్షించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



భీమదేవరపల్లి వాయిస్ టుడే డిసెంబర్ 31 : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో మామిడాల శ్రావణ్ కుమార్ %ూ%/వీరమల్లు వయసు 44 సంవత్సరంలు కులం పద్మశాలి మానసిక పరిస్థితి బాగా లేక రోడ్లపై తిరుగుతూ ఎవరు అన్నం పెడితే తినుకుంటూ ఉండేవాడు. మృతుడు అయిన మామిడాల శ్రవణ్ కుమార్ తేదీ 2024 డిసెంబర్ 30. సోమవారం రాత్రి 9:30 గంటల సమయంలో హవాల్దార్ పల్లె నుండి ముల్కనూరుకు రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనగా మృతుడికి రోడ్డుపై వెళ్తున్న వారు చూసి 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం ఎంజీఎం హాస్పిటల్ కు తరలించి మృతుడు చికిత్స పొందుతూ రాత్రి సమయంలో 1:45 గంటలకు చనిపోయినాడు అని డ్యూటీ డాక్టర్ తెలిపినారు.మృతుని భార్య అయినా మామిడాల రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు తెలిపారు.



## పదవి విరమణ పొందిన ఏఆర్ ఎస్సై మిర్జా హాసన్ అలీ బేగ్

### ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఐపీఎస్

కరీంనగర్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31(వాయిస్ టుడే)కరీంనగర్ కమీషనరేట్ మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగంలో డ్రైవర్ గా పనిచేస్తూ పదవీకాలం ముగిసిన మిర్జా హాసన్ అలీ బేగ్ దాదాపు 42 సంవత్సరాల సుదీర్ఘ కాలంపాటు పోలీసు శాఖకు సేవలందించి మంగళవారంనాడు పదవి విరమణ పొందారు. పదవి విరమణ పొందుతున్న ఏ.ఆర్.ఎస్సై మిర్జా హాసన్ అలీ బేగ్ కి పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. వారికి జ్ఞాపిక అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణతో పాటుగా రిజర్వు ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి (సంక్షేమం), కుమారస్వామి(ఎం. టి. ఓ.), ఉమ్మడి జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడాల సురేందర్ ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏలూరులో పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు, డిసెంబర్ 31 (వాయిస్ టుడే ప్రతినిధి): ఏలూరు జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహ ధారుద్య పరీక్షలుల జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ పరీక్షలను పర్యవేక్షించారు. ఉదయం నుండి ఏలూరు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రారంభం అయిన ఫిజికల్ మెజర్మెంట్స్ మరియు ఫిజికల్ ఎఫ్సన్సి పరీక్షలు ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ నియమ నిబంధనలకు అనుగుణంగా, సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీల పర్యవేక్షణ మరియు డ్రోన్ ను ఉపయోగించి పారదర్శకంగా, నిష్పక్షపాతముగా దేహ ధారుద్య పరీక్షల నిర్వహణ కొనసాగుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు.





## కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం

### ఆత్మీయ సదస్సులో ఎంఎల్ఏ తెల్లం వెంకటరావు

భద్రాచలం, డిసెంబర్ 31 (వాయిస్ టు డే ) ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యం గా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన సాగు తున్నదని భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకటరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ కి కార్యకర్తలే బలం అని, కార్యకర్తల్ని కంటికిరెప్పలా కాపాడుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. భద్రాచలం అసెంబ్లి నియోజకవర్గ పరిధి లోని వెంకటాపురం లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లో ఎంఎల్ఏ తెల్లం వెంకటరావు మాట్లాడుతూ నియోజకవర్గం లో అన్ని మండలాల్లోనూ పార్టీ సమన్వయ, ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలు ద్వారా కార్యకర్తల మంచి చెడులు తెలుసుకుంటూ ముందుకు సాగుతామని అన్నారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ కలయికలో భాగంగా వెంకటాపురం మండలంలోని అన్నీ పంచాయితీలు, గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు పెద్ద సంఖ్య లో హాజరై 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఏర్పాట్లు చేయడాన్ని ఎంఎల్ఏ అభినందించారు. సదస్సు లో ముందుగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కి మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బి హెచ్ ఈ ఎల్ బస్ పునరుద్ధరణ

### ఆర్టిసి డిపో మేనేజర్ తిరుపతి



భద్రాచలం, డిసెంబర్ 31 (వాయిస్ టుడే): భద్రాచలం నుండి హైదరాబాద్ బిహెచ్ ఈఎల్ వరకు సూపర్ లగ్జరీ బస్సులను పునరుద్ధరించినట్లు భద్రాచలం ఆర్టిసి బస్ డిపో మేనేజర్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్ సమయ వివరాలు భద్రాచలం నుండి ఉదయం 10.00 గంటలకు, రాత్రి 20.45 గంటలకు బస్ బయలుదేరునని పేర్కొన్నారు. బి హెచ్ ఈ ఎల్ నుండి ఉదయం 05.45 గంటలకు, రాత్రి 20.30 గంటలకు బస్ బయలుదేరుననీ ఆయన తెలిపారు. ఇట్టి బస్సులు భద్రాచలం, ఖమ్మం, హైదరాబాద్ మహాత్మాగాంధీ బస్ స్టాండ్ , కూకట్ పల్లి మీదుగా బి హెచ్ ఈ చే తెలిపారు. ఉదయం 10.00 గంటలకు బి హెచ్ ఈ ఎల్ బయలుదేరిన డ్రైవర్ 19.15 కి చేరుకుని, బి హెచ్ ఈ ఎల్ లో 10.30 నిమిషాల విశ్రాంతి తీసుకొని మరుసటి రోజు 5.45 కి డ్యూటీ ప్రారంభిస్తాడ నీ తెలిపారు. 20.45 బి హెచ్ ఈ ఎల్ లో బయలుదేరే డ్రైవర్ 05.15 కి చేరుకుని అక్కడ 15.15 నిమిషాలు విశ్రాంతి తీసుకొని 20.30 కి డ్యూటీ స్టార్ట్ చేస్తాడు అని పేర్కొన్నారు. మియాపూర్ డిపో నందు భద్రాచలం నడుచు 5 సర్వీసులకు ఒక్క సర్వీస్ కు 2 రోజుల డ్యూటీ మాత్రమే ఇవ్వబడుతుంది అని చెప్పారు. కానీ భద్రాచలం డిపో కార్మికులకు ఒక్కరికీ మూడు రోజులు, ఒక్కరికీ రెండు రోజులు డ్యూటీ ఇవ్వబడునని మేనేజర్ తిరుపతి తెలిపారు.



## శాంతి మార్గం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

రామకృష్ణాపూర్ డిసెంబర్ 31 ( వాయిస్ టుడే ) రామకృష్ణాపూర్ ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి మార్గం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ మంగళవారం ఏ.జోన్ బిలాల్ మజీద్ నందు మైనార్టీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ముస్లిం మత పెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ దేశంలో శాంతి సౌభ్రాతృత్వంతో కుల,మతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జీవించాలని, ఒక మతం వారు ఇంకొక మతాన్ని గౌరవిస్తూ ముందుకు సాగాలని ఈ యొక్క క్యాలెండర్లో ప్రచురణ చేయడం జరిగిందని అన్నారు. గత 10 సంవత్సరాలుగా బిలాల్ మస్జిద్ మేజాన్ పాష తన సొంత ఖర్చుతో క్యాలెండర్ ప్రచురణ చేసి ముస్లిం సోదరులకు అన్ని వర్గాల వారికి అందజేయడం గొప్ప విషయం అని కొనియాడారు. అదేవిధంగా పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ యువత, ప్రజలు సంతోషకరమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ ప్రెసిడెంట్ అఫ్జల్, బిలాల్ మస్జిద్ సదర్ ఆరిఫ్, ఖాజా షరీఫ్ పాషా, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## పాఠశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

తొర్రూరు, డిసెంబర్ 31 వాయిస్ టుడే : తొర్రూరు మండలం పోలెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ, విద్యార్థి బృందం ముందస్తుగా 2025 నూతన సంవత్సర సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోఅందమైన రంగవల్లికలను తీర్చి దిద్దడంతోపాటు, కేక్ కట్ చేయడం,మిఠాయి పంపకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భీమా,సహఉపాధ్యాయులు శ్రీనివాస రావు ,స్వాతి,ఝాన్సీ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, మంత్రి కొండా సురేఖల కృషి

### వరంగల్ కృష్ణ కాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హై స్కూల్‌లకు నూతన బిల్డింగ్ నిర్మాణం

### సాకారమవనున్న విద్యార్థుల కల

### హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



వరంగల్ ( వాయిస్ టుడే ) డిసెంబర్ 31: మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండా మురళీధర్ రావు ప్రత్యేక చొరవతో వరంగల్ జిల్లా స్టేషన్ రోడ్ లోని కృష్ణ కాలనీలో వున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హై స్కూల్ లకు త్వరలో నూతన బిల్డింగ్ కాంప్లెక్స్ రూపుదిద్దుకోనుంది. గత ఆగస్టు నెలలో ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హై స్కూల్ ను తనిఖీ చేసిన మురళీధర్ రావు 70 ఏళ్ళకు పైగా సేవలందిస్తూ వస్తున్న ఆ విద్యాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించారు. గోడలు, తరగతి గదులు మన్నికను కోల్పోయి, పెచ్చులూడి, వర్షపు నీటి నిల్వతో దుస్థితికి చేరుకున్న తీరును, విద్యార్థుల పడుతున్న బాధలను స్వయంగా తెలుసుకుని, పాత బిల్డింగ్ స్థానంలో నూతన బిల్డింగ్ నిర్మాణం చేపట్టి, విద్యార్థులను కష్టాలను తొలగిస్తామని అయన హామీ ఇచ్చారు.

ఈ దిశగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ మంత్రి కొండా సురేఖ స్వయంగా దృష్టి సారించి, కార్యాచరణను ప్రారంభించారు. ఇందుకు అవసరమైన నిధులను సిఎస్ఆర్ (కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటి) ద్వారా సమీకరించి, త్వరలో నూతన బిల్డింగ్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకుగాను కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. జూనియర్ కాలేజీ నిర్మాణానికి రూ. 4.5 కోట్లు, హై స్కూల్ నిర్మాణానికి రూ. 1.48 కోట్లతో మొత్తం రూ. 5.98 కోట్లతో వీటి కోసం నూతన భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ మేరకు తెలంగాణ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ (TGEWIDC) అంచనా ప్రణాళికలను సిద్ధం చేసింది. సిఎస్ఆర్ నిధులను సమీకరించిన వెంటనే నూతన బిల్డింగ్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

కొత్త బిల్డింగ్ నిర్మాణంతో తమ సమస్యలు తీరనుండటంతో ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హై స్కూల్ విద్యార్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు నెలల్లోనే నూతన బిల్డింగ్ నిర్మాణానికై మడమతిప్పకుండా కృషి చేసి, తమ కలను సాకారం చేసిన మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ రావు, మంత్రి సురేఖ లకు విద్యార్థులు, వరంగల్ తూర్పు ప్రజలు రుణపడి వుంటారని వారంతా సంతోషాన్ని వ్యక్తం చేశారు. నూతన బిల్డింగ్ నిర్మాణం దిశగా కార్యాచరణను వేగవంతం చేసినందుకుగాను ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శరదృతి, హై స్కూల్ హెడ్ మాస్టర్ అశోక్ కుమార్ హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో మంత్రి కొండా సురేఖ ని వారి కార్యాలయంలో కలిసి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు, వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తూనే వుంటామని మంత్రి సురేఖ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ ను అత్యద్భుతంగా తీర్చిదిద్దే దిశగా పట్టుబట్టి ఒక్కో అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడుతూ, వరంగల్ ఖ్యాతి విశ్వవ్యాప్తం అయ్యేలా శ్రమిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.



## రైస్ మిల్లు డ్రైవర్లకు కనీసవేతనం అమలుచేయాలి

తొర్రూరు, డిసెంబర్ 31 వాయిస్ టుడే : రైస్ మిల్ డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియాట టి యు సి ఐ )మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. తొర్రూర్ ప్రాంత పరిధిలో గత ఆరు రోజులుగా రా రైస్ మిల్లు డ్రైవర్లు వేతనాల పెంపు కోసం సమ్మె నిర్వహిస్తున్నారని అన్నారు. యజమానుల పిలుపుతో మంగళవారం తొర్రూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరిగిన చర్చలు విఫలమైన అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన కార్మికుల నుద్దేశించి ప్రసంగించారు.పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని కనీస వేతనం అమలు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల అన్ని రకాల ధరలు ఆకాశాన్నింటి కార్మికులు వారి కుటుంబాలు ఖర్చుల భరించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రా రైస్ మిల్ యజమానులు సానుకూలంగా ఆలోచించి పెంచాలని వేతనాలను పెంచాలని కోరారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. ప్రతి కార్మికుడికి 26000 ఇవ్వాలని సామాజిక భద్రత కింద తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం హమాలి అండ్ మిల్లు డ్రైవర్స్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారిని వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు యాకయ్య , ప్రధాన కార్యదర్శి బాలు , కార్యవర్గ సభ్యులు శ్రీను, వెంకన్న, అనిల్, భాష ,శివ, రవీందర్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.





## పేపర్ బాయ్స్‌కు షట్టర్లు పంపిణి

తొర్రూరు, డిసెంబర్ 31 వాయిస్ టుడే : లైన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు చాటర్ ప్రెసిడెంట్ పూర్వపు జిల్లా గవర్నర్ చీఫ్అడ్వైజర్ లయన్ డాక్టర్ కె రాజేందర్ రెడ్డి 73వ జన్మదిన సందర్భంగా లైన్స్ క్లబ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్ అధ్యక్షులు పద్మం యాదగిరి ఆధ్వర్యంలో తొర్రూరు ఎల్ వై ఆర్ గార్డెన్ రోడ్డులో పేపర్ బాయ్స్ కి షట్టర్స్ పంపిణీ కార్యక్రమం మరియు కేక్ కటింగ్ పండ్ల పంపిణీ చేయటం జరిగినది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పూర్వపు జిల్లా గవర్నర్ లయన్ తమ్మెర లక్ష్మీ నరసింహ రావు . %ఖీ.ఔ.జ% జిల్లా కోఆర్డినేటర్ వేలూరి శారద మేడం . డిస్టిక్ అడిషనల్ సెక్రెటరీ రేవూరి వెంకన్న . లైన్స్ క్లబ్ వినాయక ఫ్రెండ్స్ కోశాధికారి తల్లాడ హీరాధర్ . చాటర్ ప్రెసిడెంట్ కందగట్ల సోమశేఖర్ . రేవూరి శ్రీధర్ .సభ్యులు బిజ్జా ల సోమయ్య . కూరపాటి శ్రీనాథ్ .ప్రజాపతి ప్రకాష్ . ప్రజాపతి తగరం ఆడెపు స్వామి. కూరపాటి సోమయ్య .గుండాల నర్సయ్య పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కడియం

### ఏడాదికాలంలో 750కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు

### రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి



ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు మరియు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరియు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి ప్రజలందరి సహకారంతో ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా మీకు ఇచ్చిన హామీల్లో ప్రధాన అంశాలను పరిష్కరించుకోగలిగామని తెలిపారు. ఈ ఏడాది కాలంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రి వర్గం సహకారంతో మొత్తం 750కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు తీసుకువచ్చానని శ్రీహరి తెలిపారు. అందులో ప్రధానంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, 100పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ డివిజినల్ ఆఫీస్ కాంప్లెక్స్ , స్టేషన్ ఘనపూర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీ గా చేసుకోవడంతో పాటు సాగునీటి కోసం ఘనపూర్ రిజర్వాయర్ నుండి నవాబ్ పేట రిజర్వాయర్ మెయిన్ కెనాల్ సిసి లైనింగ్ ఏర్పాటుకు త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించుకోబోతున్నామని అన్నారు. 2025 నూతన సంవత్సరంలో కూడా మీ అందరి సహకారం, భాగస్వామ్యంతో నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలను చేసుకోవడంతో పాటు పేద వర్గాలకు ఇందిరమ్మ ఇండ్లు అందించబోతున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో నా వెన్నంటే ఉంటూ సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు. ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి ఆశలు, ఆకాంక్ష నెరవేరాలని అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మరోసారి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## MRPS-T రాష్ట్ర అధ్యక్షునిగా బొక్కల వెంకటస్వామి మాదిగ




హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తి గ్రామానికి చెందిన బొక్కల వెంకటస్వామి మాదిగను హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయం నందు వ్యవస్థాపక అధ్యక్షులు చిట్టుపాక ప్రభాకర్ మాదిగ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకొని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాదిగ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బాధ్యతలు నాపై నమ్మకంతో అప్పగించిన వ్యవస్థాపక అధ్యక్షులు ప్రభాకర్ మాదిగ కు, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును తెలంగాణ ప్రభుత్వం త్వరితగతిన అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్లను 15% నుంచి 18% వరకు ప్రస్తుతం పెరిగిన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ ఏబిసిడి వర్గీకరణను వెంటనే అమలు చేయాలని మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ MRPS -T నుండి రాష్ట్ర అధ్యక్షునిగా డిమాండ్ చేస్తున్నానని నూతన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొక్కల వెంకటస్వామి మాదిగ అన్నారు.

## నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలి

### :– యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు




భువనగిరి ( వాయిస్ టుడే ప్రతినిధి):– మెనూ ప్రకారం,నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు.మంగళవారం రోజు భువనగిరి మండల కేంద్రంలోని రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించి మధ్యాహ్న భోజన పథకంలో బాగంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనంలో నూతన మెనూ ప్రకారం నాణ్యత ప్రమాణాలతో పాటిస్తూ విద్యార్థులకు రుచికరమైన వంట చేయడం జరిగిందని తెలిపారు. నాణ్యమైన వంట చేసిన ఏజెన్సీ సభ్యురాలు కవితను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ప్రతి రోజు ఇదేవిధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ సభ్యురాలను కోరారు.. మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేస్తున్న ఏజెన్సీకి నిధులు త్వరలో మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యను ఎలా బోధిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ మీరు ఎలా చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని ఈ దశలో చదువు మీద ప్రత్యేక దృష్టి పెడితేనే భవిష్యత్ బాగుతుందని విద్యార్థులకు హితబోధ చేశారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు జి. పి. ఏలో 10/10 సాధిస్తే ఎమ్మెల్యే తో విద్యార్థుల తల్లి దండ్రుల కు సన్మానం చేస్తూ, వారి సమక్షంలో సైకిళ్ళు బహుమతిగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నా రు. జిల్లాను ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. మంచిగా చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని, ఉన్నత స్థానాలను చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవడం వలన జ్ఞాపక శక్తి పెరుగుతుందని,దాని వలన విద్యార్థులు చదువు పట్ల ఎక్కువ శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అండాలు,ఫుడ్ కమిటీ ఏజెన్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .